05-08-2025, మంగళవారం

TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక

JANAM POWER

సంపుటి: 10 | సంచిక:69 | వెల:05

EDITOR: BANDARI MARUTHI

ఈరోజు జన్మదినోత్సవం జరుపుకుంటున్న ఆత్మీయులు

## శ్రీరాం మధు - శ్వేత అక్కయ్య గార్లకు హృదయపూర్వక జన్మదినోత్సవ శుభాకాంక్షలు.

ఇలాంటి జన్మదినోత్సవాలను వారు మరిన్ని జరుపుకోవాలని మన:స్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ..



మా అక్కయ్య ఆత్మీయతకు మారు పేరు.. అనురాగానికి చిరునామా..
అక్కయ్య పిలుపులో ఆప్యాయత.. పలకరింపులో మమతానురాగం..
నాకు అన్ని తానై.. తోడూ నీడై ప్రతి అడుగులోకి మార్గదర్శిగా నిలిచిన..
శ్రీరాం మధు.. శ్వేత అక్కకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
అక్కయ్యకు ఆ భగవంతుడి ఆశిస్సులుండాలి..
ప్రతి అడుగులోనూ విజయం చేకూరాలని ఆశిస్తూ..



## బండారి మారుతి

ఎస్సార్కే గ్రూపు సంస్థల ఛైర్మన్

వాస్తవం,జనం పవర్ దినపత్రికల ఛైర్మన్

SRK GREEN ENERGY

GROUP OF SRK

SRK TV | SRK GREEN ENERGY | SRK Tech IT SOLUTIONS | SRK CLOTHING | MUZIGAL



# అమరావతిలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు

**జనం పవర్, హైదరాబాద్ :**

రాజధాని అమరావతిలో జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ ఛైర్మన్ డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఇవి తెలుగు కుంభమేళాగా నిర్వహించబోతున్నామని ఆయన వెల్లడించారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న అనంతరం విలేకర్లతో మాట్లాడిన ఆయన.. ఈ మహాసభలకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు రాష్ట్రాల గవర్నర్లు, ప్రముఖులు, 60కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. తెలుగు సాహిత్య ప్రక్రియలపై సదస్సులు, వేయిమంది కవులతో కవి సమ్మేళనం, లక్ష మంది విద్యార్థులు, యువతతో సాంస్కృతిక కార్యక్రమాలు ..మిగతా 3లో



# సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరు యువకుల దుర్మరణం**



# జార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరెన్ మృతి

**జనం పవర్, హైదరాబాద్ :**

క్యాంటీన్ సిబ్బందితో ఓ ఎమ్మెల్యే గొడవకు దిగి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మహారాష్ట్రలోని ముంబయిలో చోటుచేసుకుంది. శివసేన శిందే వర్గం ఎమ్మెల్యే ..మిగతా 3లో



# టార్గెట్.. కవిత

- కేసీఆర్ కూతురును టార్గెట్ చేసిన బీఆర్ఎస్ నేతలు
- మౌనంగా ఉన్న పార్టీ అధినేత కేసీఆర్
- కవిత విషయంలో బీఆర్ఎస్ ఏం చేయబోతున్నది?
- కవిత కోవర్టు అంటూ గులాబీ నేతలు ఆరోపణలు
- కేసీఆర్ కుమార్తె కొత్త పార్టీ పెట్టబోతున్నారా?
- కవిత, కేటీఆర్ మధ్య ఆస్తి తగాదాలు నిజమేనా?
- కేసీఆర్ ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారు
- బీఆర్ఎస్ పార్టీలో ముసలం..

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చుట్టూ ఉద్భవించిన తాజా వివాదం సంచలనంగా మారింది. బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కవితను టార్గెట్ చేస్తూ చేసిన విమర్శలు, ఆమె కేసీఆర్ శత్రువుల భాషలో మాట్లాడుతున్నారని ఆరోపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా నిలిచింది. ఈ వివాదంలో కేసీఆర్ మౌనం, కేటీఆర్ వైఖరి, కవిత రాజకీయ లక్ష్యాలు ప్రశ్నార్థకంగా మారాయి.

**కవితపై జగదీశ్ రెడ్డి విమర్శలు**

ఇటీవల నల్లగొండలో జగదీశ్ రెడ్డి మీడియా సమావేశంలో కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ శత్రువులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జర్నలిస్ట్ వేమూరి ..మిగతా 3లో



## సోషల్ మీడియా జర్నలిస్టులను

# గౌరవించాలి

## సీఎం వ్యాఖ్యలకు కోమటి రెడ్డి కౌంటర్

## ఎక్స్ వేదికగా పోస్టు

**జనం పవర్, హైదరాబాద్ :**

ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పని చేస్తున్న సోషల్ మీడియాను పాలకులు అవమానించడం తగదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదటి నుంచి తన శక్తి మేరకు పని చేస్తూనే ఉందన్నారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటానని స్పష్టం చేశారు. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికీ విభజించి పాలించడం తప్ప ఏమీ కాదని విమర్శించారు. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదని రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఇక ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సోషల్ ..మిగతా 3లో

# స్పైస్‌జెట్ సిబ్బందిపై లెఫ్టినెంట్ కర్నల్ దాడి

## శ్రీనగర్ విమానాశ్రయంలో ఘటన





# తెలంగాణ వర్సిటీలో విద్యార్థిని ఆత్మహత్య



## విద్యార్థులకు ఒక్కపూట కూడా

# అన్నం పెట్టలేరా?

## జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై సుధీర్ఘ చర్చ

**జనం పవర్, హైదరాబాద్ :**

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు అరగంట పాటు కొనసాగిన ఈ భేటీలో ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వ పథకాల అమలు, రాబోయే పార్లమెంట్ సమావేశంపై విస్తృతంగా చర్చించినట్టు సమాచారం. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల పురోగతిని రాష్ట్రపతికి వివరించారని, ముఖ్యంగా వికసిత భారత్ - 2047 దిశగా జరుగుతున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా, ఇటీవల అంతర్జాతీయ వేదికలపై భారత్ సాధించిన విజయాలు, విదేశాంగ సంబంధాలపై కూడా ప్రధాని రాష్ట్రపతికి నివేదించినట్టు సమాచారం. రాష్ట్రపతి ముర్మ్మ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ స్థాయిలో మరింత ఫలప్రదంగా అమలవ్వాలని సూచించినట్టు సమాచారం. అంతేకాకుండా, మహిళా సాధికారత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్రపతి ప్రధానికి సూచించారు. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్మ్మ మధ్య జరిగే భేటీలు సాధారణ పద్ధతి కిందనే జరుగుతుంటాయి. దేశంలోని కీలక అంశాలపై రాష్ట్రపతికి నివేదిక ఇవ్వడం, ఆమె సూచనలు స్వీకరించడం రాజ్యాంగ పరమైన ప్రక్రియలో భాగమే. ఈ రోజు జరిగిన సమావేశం కూడా ఆ పరంపరలో భాగమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

# యెమెన్ తీరలో విషాదం



## పడవ బోల్తాపడి
## 68 మంది మృతి
## మరో 74 మంది గల్లంతు

**జనం పవర్, హైదరాబాద్ :**

అడెన్ గల్ఫ్ తీరంలో మరోసారి విషాదం చోటుచేసుకుంది. ఆఫ్రికన్ వలసదారులతో వెళ్తున్న పడవ యెమెన్ తీరంలో బోల్తా పడటంతో 68 మంది జలసమాధి అయ్యారు. ఇంకా 74 మంది గల్లంతైనట్లు ఐక్య రాజ్యసమితి వలసదారుల సంస్థ అధికారికంగా ప్రకటించింది. 154 మంది ఇథియోపియన్ జాతీయులను తీసుకువెళ్తున్న పడవ సౌథర్న్ ..మిగతా 3లో






Contact: 96181 81112



# హైదరాబాద్‌లో రోడ్లపై భారీగా వరద ప్రవాహం..

## వాహనదారుల ఇక్కట్లు

హైదరాబాద్ మహానగరంలో జోరు వర్షం కురుస్తోంది. వనస్థలిపురం, హయత్‌నగర్, పంజాగుట్ట, కూకట్ పల్లి వరకు అన్నిప్రాంతాల్లో భారీగా వాన పడుతోంది. అటు కార్వాన్, గోల్కొండ, జియాగూడ నుంచి సికింద్రాబాద్, బోయిన్‌పల్లి వరకు అన్ని ప్రాంతాల్లో వాన దంచికొడుతోంది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, మాదాపూర్, కూకట్‌పల్లి, హైదర్ నగర్, వివేకానందనగర్, హిమాయత్ నగర్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్ బాగ్, కాప్రాలో వర్షపు నీరు రోడ్లపై చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# అమరావతిలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తామని వివరించారు. 25 సాహిత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ప్రధాన వేదిక వద్ద దాశరథి, సి .నారాయణరెడ్డి పేరిట ముఖద్వారాలు ని ర్మిస్తామని తెలిపారు. ఈసారి పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రజాగాయకుడు దివంగత గద్దర్‌కు ప్రకటించామని, ఆయన కుమార్తె వెన్నెలకు అవార్డును ప్రదానం చేయనున్నామని ప్రకటించారు.

# సోషల్ మీడియా జర్నలిస్టులను గౌరవించాలి

(మొదటిపేజీ తరువాయి)

మీడియా జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాజగోపాల్‌రెడ్డి స్పందించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఇటీవల పత్రికా ప్రతినిధులతో మాట్లాడే సమయంలో "కొంతమంది సోషల్ మీడియా పేరుతో దుష్ప్రచారం చేస్తున్నారు, వారిని మీడియా ప్రతినిధులుగా పరిగణించలేం" అని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై సర్వత్రా భిన్నాభిప్రాయాలు, విమర్శలు వ్యక్తం అయ్యాయి.

# తెలంగాణ వర్సిటీలో విద్యార్థిని ఆత్మహత్య

- **గదిలోనే ఉరేసుకొని బలవన్మరణం**



కామారెడ్డి జిల్లా భిక్కనూరులోని తెలంగాణ విశ్వవిద్యాలయ వసతి గృహంలో దుర్ఘటన చోటుచేసుకుంది. బీర్కూరు మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దండు అశ్విని (24) అనే పీజీ విద్యార్థిని ఆదివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తెలుగు విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న అశ్విని, సాయంత్రం ఫోన్‌లో మాట్లాడిన తర్వాత తన గదిలోకి వెళ్లి ఇలాంటి తీవ్రమైన నిర్ణయం తీసుకుంది. విషయం తెలిసిన సహ విద్యార్థులు, సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే వాహనం అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన విద్యార్థులు ఆ వాహనాన్ని ధ్వంసం చేసి, డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటనతో విశ్వవిద్యాలయం ఆవరణలో ఉద్రిక్తత నెలకొంది. అశ్విని ఆత్మహత్య వెనుకున్న కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విశ్వవిద్యాలయం పరిసరాల్లో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ, అత్యవసర వైద్య సదుపాయాలు, వసతి గృహాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**జనం పవర్, హైదరాబాద్ :**

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ సమీపంలో సోమవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రాజీవ్ రహదారిపై ఒక కారు బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉదయం వేళ అతివేగంతో వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలై మృతిచెందారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను మిరుదొడ్డి గ్రామానికి చెందిన సందీప్ (19), రాజు (25)లుగా గుర్తించారు. ఈ ప్రమాదంతో వారి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



# రాజకీయాల్లో త్యాగాలు ఎవరూ చేయరు

- **అధికారం కోల్పోవడానికి ఇష్టపడరు**
- **కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్**

**జనం పవర్, హైదరాబాద్ :**

కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన "రాజ్యాంగ సవాళ్లు" అనే సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీ కుటుంబాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. కాంగ్రెస్‌తో తన అనుబంధం, పార్టీని కర్ణాటకలో అధికారంలోకి తెచ్చిన తన కృషిని వివరించే ప్రయత్నం చేశారు. 2004లో సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని వదులుకోవడాన్ని శివకుమార్ విశేషంగా ప్రశంసించారు. "ఆ సమయంలో రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేయమని అడిగినా, సోనియా గాంధీ అధికారం కోసం కాదు అని చెప్పి, దేశాన్ని నడిపించగలగేవారని నమ్మి డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా నిలబెట్టారు. ఇది రాజకీయంగా అసమానమైన త్యాగం," అని వ్యాఖ్యానించారు. ఈ తరహా త్యాగం నేటి రాజకీయాల్లో ఎవరూ చేయరని శివకుమార్ గద్దించారు. "చిన్న చిన్న పదవుల విషయంలో కూడా ఎవ్వరూ వెనక్కి తగ్గడం లేదు. పంచాయతీ స్థాయి నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు చాలామంది అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు," అని ఆయన అన్నారు. నేరుగా పేర్లు ప్రస్తావించకపోయినా, ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సీఎం సిద్ధరామయ్య, ఆయన వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నవిగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కర్ణాటక కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు మరోసారి బయటపడినట్టుగా చర్చించుకుంటున్నారు.

# టార్గెట్.. కవిత

- **కేసీఆర్ కూతురును టార్గెట్ చేసిన బీఆర్ఎస్ నేతలు**
- **మౌనంగా ఉన్న పార్టీ అధినేత కేసీఆర్**
- **కవిత విషయంలో బీఆర్ఎస్ ఏం చేయబోతున్నది?**
- **కవిత కోవర్టు అంటూ గులాబీ నేతలు ఆరోపణలు**
- **కేసీఆర్ కుమార్తె కొత్త పార్టీ పెట్టబోతున్నారా?**
- **కవిత, కేటీఆర్ మధ్య ఆస్తి తగాదాలు నిజమేనా?**
- **కేసీఆర్ ఈ సమస్యను ఎందుకు పరిష్కరించబోతున్నారు?**
- **బీఆర్ఎస్ పార్టీలో ముసలం..**

(మొదటి పేజీ తరువాయి)



రాధాకృష్ణల మాటలను కవిత వల్లెవేస్తున్నారని, ఆమె వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. "నా ఉద్యమ ప్రస్థానంపై కవితకు ఉన్న జ్ఞానానికి జోహార్లు," అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ సర్వనాశనానికి కవిత వ్యాఖ్యలే కారణమని సూచనప్రాయంగా విమర్శించారు. కవిత స్పందిస్తూ, జగదీశ్ రెడ్డిని "లిల్లీపుట్ నాయకుడు"గా పేర్కొన్నారు. నల్గొండలో పార్టీ ఓటమికి జగదీశ్ రెడ్డే కారణమని, ఆయన వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని ఓ కీలక నాయకుడి కుట్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు కేటీఆర్‌ను ఉద్దేశించినవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**వ్యూహాత్మక నిశ్శబ్దమా?**

ఈ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కవిత రాసిన ఐదు పేజీల లేఖ వివాదం, కొత్త పార్టీ పెట్టనున్నారనే ప్రచారం వంటి సందర్భాల్లోనూ కేసీఆర్ స్పందించలేదు. ఆగస్టు 1న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డితో సుదీర్ఘ సమావేశం జరిగినప్పటికీ, కవిత విషయంపై బహిరంగంగా ఎలాంటి ప్రకటనా లేదు.

రాజకీయ విశ్లేషకులు కేసీఆర్ మౌనం వెనుక వ్యూహాత్మక ఆలోచన ఉందని భావిస్తున్నారు. కొందరు, కవిత రాజకీయ ఆకాంక్షలను అణచివేసేందుకు కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉంటున్నారని అంటున్నారు. మరికొందరు, కవిత చుట్టూ ఉద్భవించిన వివాదం బీఆర్ఎస్‌ను మళ్లీ వార్తల్లో నిలపడానికి కేసీఆర్ ఉపయోగించుకుంటున్నారని ఊహిస్తున్నారు.

**కవితపై గుట్టుచప్పుడు విమర్శలు?**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా కవిత విషయంలో స్పష్టమైన స్పందన ఇవ్వలేదు. గతంలో కవిత లేఖ వివాదంపై, "పార్టీలో అందరూ సమానమే, కొన్ని విషయాలు అంతర్గతంగా చర్చిస్తే బావుంటుంది," అని వ్యాఖ్యానించారు. అయితే, జగదీశ్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధికారిక మీడియా సంస్థ నమస్తే తెలంగాణ ద్వారా మద్దతు ఇవ్వడం, కేటీఆర్ వైఖరిని సూచనప్రాయంగా ప్రతిబింబిస్తుందని భావిస్తున్నారు. కవిత ఆరోపణలు కేటీఆర్‌ను ఉద్దేశించినవని, ఆమె వ్యాఖ్యల వెనుక పార్టీలో అధికార పోరు ఉందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.

**సొంత గుర్తింపా, కొత్త పార్టీనా?**

కవిత రాజకీయ ప్రస్థానం గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై, జైలు నుంచి విడుదలైన తర్వాత ఆమె రాజకీయ కార్యకలాపాలు తీవ్రతరమయ్యాయి. వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ చుట్టూ "దెయ్యాలు" ఉన్నాయని, పార్టీలో సీనియర్ నాయకులకు అవకాశం లేకుండా పోయిందని ఆమె లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ బహిర్గతం కావడంతో కవిత కొత్త పార్టీ పెట్టనున్నారనే ప్రచారం ఊపందుకుంది.

కొందరు రాజకీయ విశ్లేషకులు, కవిత తన సొంత రాజకీయ గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నారని, బీఆర్ఎస్‌లో కేటీఆర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నారని భావిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు సామ రామ్మోహన్ రెడ్డి, కవిత కొత్త పార్టీ పెడితే స్వాగతిస్తామని వ్యాఖ్యానించడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది. అయితే, కవిత బీఆర్ఎస్‌ను వీడితే ఆమె రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, కేసీఆర్ నీడలోనే ఆమెకు రాజకీయ ఉనికి సాధ్యమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

**కుటుంబ రాజకీయాల ప్రభావం**

బీఆర్ఎస్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లతో దారుణంగా విఫలమైంది. ఈ నేపథ్యంలో కవిత వివాదం పార్టీలో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేసింది. కొందరు, కవిత రాజకీయ ఆకాంక్షలు కేసీఆర్ కుటుంబంలో విభేదాలను సృష్టిస్తున్నాయని, ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును బలహీనపరుస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు, ఈ వివాదం కేసీఆర్ రాజకీయ వ్యూహంలో భాగమని, ఓట్లు చీల్చేందుకు కవితను ప్రత్యామ్నాయ శక్తిగా ప్రాజెక్ట్ చేస్తున్నారని ఊహిస్తున్నారు. కవిత చుట్టూ జరుగుతున్న రాజకీయ గందరగోళం బీఆర్ఎస్‌లో అంతర్గత డైనమిక్స్‌ను, కేసీఆర్ కుటుంబ రాజకీయాలను స్పష్టంగా తెలియజేస్తోంది. కేసీఆర్ మౌనం, కేటీఆర్ వైఖరి, కవిత ఆకాంక్షలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపులకు దారితీసే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో కేసీఆర్ ఈ వివాదంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, కవిత రాజకీయ భవిష్యత్తు ఏ దిశగా సాగుతుంది అనేది తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా నిలుస్తుంది.

# వివాహేతర సంబంధానికి కుటుంబం బలి

- **మధ్యప్రదేశ్‌లో ఒకే ఇంట్లో ముగ్గురు ఆత్మహత్య**

**జనం పవర్, హైదరాబాద్ :**



మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో సంచలన ఘటన చోటుచేసుకుంది. భార్య వివాహేతర సంబంధం కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. మనోహర్ లోధీ, ఆయన భార్య ద్రౌపది ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. అయితే, ద్రౌపదికి తన భర్త బాల్య స్నేహితుడు సురేంద్రతో అక్రమ సంబంధం కొనసాగుతున్నట్టు బయటపడింది. ఒకరోజు తన తల్లి సురేంద్రతో అసభ్య స్థితిలో కనిపించడంతో కుమార్తె శివాని ఈ విషయాన్ని తండ్రి మనోహర్‌కి తెలిపింది. దీంతో మనోహర్ సహా కుటుంబ సభ్యులు ఆ సంబంధాన్ని ముగించమని ద్రౌపదిని కోరారు. అయితే, సురేంద్ర లేకుండా జీవించలేనని ద్రౌపది స్పష్టంచేసింది. అంతేకాకుండా, తనపై ఒత్తిడి పెడితే వరకట్న వేధింపుల కేసు పెడతానని కూడా కుటుంబ సభ్యులను బెదిరించింది. ఆమె ప్రవర్తనతో విసిగిపోయిన భర్త మనోహర్ స్నేహితుడు సురేంద్రను కూడా ఈ సంబంధాన్ని ముగించమని కోరాడు. కానీ, అతను కూడా నిరాకరించడంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగాయి. ద్రౌపది తన వైఖరిని మార్చుకోకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన మనోహర్ కుటుంబ సభ్యులు చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదంపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి ద్రౌపదితో పాటు ఆమె ప్రియుడు సురేంద్రను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఇద్దరినీ రిమాండ్‌కి పంపించారు.



# జార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరెన్ మృతి

**జనం పవర్, హైదరాబాద్ :**

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తి మోర్చా స్థాపక నేత డా. శిబూసోరెన్ సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి విషయాన్ని ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ అధికారికంగా ప్రకటించారు. శిబూసోరెన్ ఢిల్లీలోని శ్రీ గంగా రామ్ ఆస్పత్రిలో శనివారం నుంచి మూత్రపిండ సంబంధ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో తీవ్ర లక్షణాలతో బాధపడుతున్నారు. గత ఒక నెలకు పైగా డయాలిసిస్ సేవలు తీసుకుంటున్నారు. ఆయన మూత్రపిండాలు, షుగర్, గుండె బైపాస్ సర్జరీ వంటి అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గత జూన్‌లో ఆయన ఆస్పత్రిలో చేరారు. జూన్ 26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ప్రారంభించడానికి ఆసుపత్రికి వచ్చినప్పుడు వెళ్లి ఆయనను పరామర్శించారు. శిబూసోరెన్ 1970 నుండి జార్ఖండ్‌లో నాయకుడిగా కొనసాగుతున్నారు. 1973లో పార్టీ స్థాపించి, దానికి సుమారు 38 సంవత్సరాలు నాయకత్వం వహించారు. మూడు సార్లు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా సేవలు అందించారు. ప్రస్తుతం పార్టీ నాయకత్వ బాధ్యతలు తన కుమారుడు హేమంత్ సొరెన్ తీసుకున్నారు.

# స్పైస్‌జెట్ సిబ్బందిపై లెఫ్టినెంట్ కర్నల్ దాడి

(మొదటి పేజీ తరువాయి)




శ్రీనగర్ విమానాశ్రయంలో సీనియర్ సైనికాధికారి చేసిన దాడి ఘటన పెద్ద దుమారం రేపింది. పరిమితికి మించి లగేజీ తీసుకొచ్చినందుకు అదనపు రుసుం చెల్లించాలని స్పైస్‌జెట్ సిబ్బంది కోరగా, ఆగ్రహంతో లెఫ్టినెంట్ కర్నల్ ఆర్. కె.సింగ్ వారిపై విరుచుకుపడ్డారు. ఈ ఘటన గత నెల 26న చోటుచేసుకుంది. లగేజీ ఫీజు చెల్లించమని సిబ్బంది పట్టుబడటంతో తట్టుకోలేని కర్నల్ ఒక్కసారిగా కోపావేశానికి లోనై సిబ్బందిపై దాడి ప్రారంభించారు. మొదట కొందరిపై దాడి చేసి కొట్టగా, తరువాత అక్కడి ఇనుప స్టాండును ఎత్తుకొని మరికొందరిపై విరుచుకుపడ్డారు. ఈ దాడిలో పలువురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఒకరికి వెన్నెముకకు బలమైన గాయం కాగా, మరొకరి ముక్కు, దవడ పగిలి రక్తస్రావమైంది. కొంతమంది స్పృహ తప్పి కుప్పకూలినా కర్నల్ దాడిని ఆపలేదని సాక్షులు తెలిపారు. మొత్తం సంఘటన వీడియో రూపంలో అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది. వెంటనే సహచరులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తీవ్ర గాయాలతో బాధపడుతున్న ఇద్దరిని ప్రత్యేక విభాగంలో చేర్చారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. లెఫ్టినెంట్ కర్నల్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరోవైపు ఈ దాడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీసులు ఇప్పటికే విమానాశ్రయం సీసీటీవీ ఫుటేజీలను సేకరించగా, పూర్తి స్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

# యెమన్ తీరంలో విషాదం

- **పడవ బోల్తాపడి 68 మంది మృతి**
- **మరో 74 మంది గల్లంతు**

(మొదటి పేజీ తరువాయి)



యెమెనీ ప్రావిన్స్ సమీప తీరంలో మునిగిపోయింది. ఇప్పటి వరకు కేవలం 10 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని స్థానిక సీనియర్ ఆరోగ్యాధికారి అబ్దుల్ ఖాదిర్ బజామిల్ తెలిపారు. వారిలో తొమ్మిది మంది ఇథియోపియన్ వలసదారులు కాగా, ఒకరు యెమెన్‌కు చెందిన వ్యక్తి అని వెల్లడించారు. రక్షక బృందాలు చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 54 మృతదేహాలు ఖన్‌ఫర్ జిల్లా తీరానికి కొట్టుకొచ్చాయి. మరో 14 మృతదేహాలు వేరే ప్రాంతంలో లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. వాటిని స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. ఇప్పటికీ 74 మంది గల్లంతైపోయినట్లు అధికారులు పేర్కొంటూ, మిగతావారిని వెతికే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. ఆఫ్రికా దేశాల నుంచి యెమెన్ ద్వారా గల్ఫ్ దేశాలకు వలస వెళ్ళే ప్రయత్నాలు కొనసాగుతుండగా, ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. కాగా, గల్లంతైన వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నదని యెమెన్‌కు చెందిన అబ్యాన్ భద్రతా విభాగం పేర్కొంది. బలమైన అలల కారణంగా గాలింపు చర్యలు కష్టంగా మారిందన్నారు.

**గతంలో ఎన్నో ప్రమాదాలు...**

ఆఫ్రికాలోని హార్న్ ఆఫ్ ఆఫ్రికా ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు చేరుకోవడానికి ప్రధాన మార్గంగా యెమెన్ ఉంది. తూర్పు, హార్న్ ఆఫ్ ఆఫ్రికా దేశాల నుంచి గల్ఫ్ అరబ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే వలసదారులు ఈ మార్గం నుంచే వెళ్తారు. అయితే ఎర్ర సముద్రం లేదా అడెన్ గల్ఫ్ మీదుగా తరచుగా ప్రమాదకరమైన, రద్దీగా ఉండే పడవల్లో వలసదారులను స్మగ్లర్లు తరలిస్తుంటారు. ఇటీవల నెలల్లో యెమెన్ తీరంలో జరిగిన బోటు ప్రమాదాల్లో వందల సంఖ్యలో వలసదారులు మృతి చెందడం జరిగింది. మరెంతో మంది గల్లంతయ్యారు.

# స్టీలు పాత్రల్లోనే వంటావార్పు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్







**జనం పవర్, తిమ్మాపూర్, ఆగస్టు 4:** రాష్ట్రంలోని సుమారు 700 గురుకులాల్లో ఇకపై స్టీలు పాత్రల్లోనే వంటవార్పు చేపట్టనున్నామని సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మొట్ట మొదటగా కరీంనగర్ జిల్లా అలుగు నూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. అలుగునూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్టీలు పాత్రల్లో వంటావార్పు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పాఠశాలలో వంటకు కావలసిన స్టీలు పాత్రలను అందజేశారు. అంతకుముందు భోజనశాల, వంట గదులు,అల్పాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించిన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసి ఉదయం పాఠశాల అసెంబ్లీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అల్యూమినియం పాత్రల్లో ఆహారం నిల్వ ఉంచడంవల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతున్నందున స్టీలు పాత్రల కోసం ప్రతి పాఠశాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, బలవర్థక ఆహారం నాణ్యమైన విద్యలే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అలుగునూరు సంక్షేమ పాఠశాల విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు పేరు పొందిన విద్యాసంస్థ ల్లో సీట్లు సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి మాట్లాడుతూ స్టీల్ పాత్రల్లో వంట వార్పు విధానాన్ని కరీంనగర్‌లో ప్రారంభించామని, మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫోన్ మిత్రను ఉపయోగించుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఫోన్‌మిత్ర ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అలుగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. విద్యా వాహిని యూట్యూబ్ ఛానల్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు నేర్చుకోవాలని సూచించారు. తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**జనం పవర్, మంథని, ఆగస్టు 4:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీపీ, బైపీసీ విభాగంలో 2025-2026వ విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్లకు బాలుర నుండి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు) మంథని, ప్రిన్సిపాల్ శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల స్పాట్ అడ్మిషన్లకు బుధవారం (06/08/2015)ఉదయం 9 గంటల నుండి ఎంపీసీ విభాగంలో, బైపీసీ విభాగంలో మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. 2025 మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. స్పాట్ కౌన్సిలింగ్ వచ్చేటువంటి విద్యార్థులు తప్పనిసరిగా తమ యొక్క ఒరిజినల్ విద్యార్హత పత్రాలు (టిసి, మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధృవీ కరణ పత్రం, ఆధార్ జిరాక్స్, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు) వెంట తీసుకురావాలని ఆయన సూచించారు.

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టిన ఎన్.కీమ్యా నాయక్



**జనం పవర్, వనపర్తి, ఆగష్టు 4:** వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎన్. కీమ్యా నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు అదనపు కలెక్టర్ రెవెన్యూ విధులు నిర్వహిస్తున్న జి. వెంకటేశ్వర్లు ఫ్యూచర్ సిటీకి బదిలీ అయినందున వారి స్థానంలో కొత్తగా వచ్చిన ఎన్.కీమ్యా నాయక్ సోమవారం వనపర్తి కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన అదనపు కలెక్టర్‌కు పరిపాలన అధికారి భానుప్రకాష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

## ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

### సీపీ అంబర్ కిషోర్ ఝా

**జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 4:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-లేవన్ కార్యక్రమం విజయవంతమైంది. ఈసందర్భంగా పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మీడియాతో మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మొత్తం 193 మంది బాలలను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో పెద్దపల్లి జిల్లాలో 71మంది (52 బాలురు, 19బాలికలు), మంచిర్యాల జిల్లాలో 122 మంది (84 బాలురు, 38 బాలికలు) ఉన్నారు. గుర్తించిన బాలలలో కొందరిని తిరిగి పాఠశాలల్లో చేర్పించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, బాలల హక్కుల పరిరక్షణకు దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు పోలీస్, బాల సంక్షేమ, కార్మిక శాఖల సమన్వయంతో చేపట్టారు. ఈ సమయంలో మొత్తం 18 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, బాలల రక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాలలపై అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వారు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా డయల్ 100కి వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరెట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్‌లత, ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధా న్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీ లన జరుపుతూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 43 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీఓలు మధు సుధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, డిఆర్డిఓ రఘు వరన్, డీపీఓ మధన్ మోహన్, జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి, వితంతు మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలి



**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 4:** అర్హులైన ఒంటరి వితంతు మహిళలకు పెన్షన్లతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మండల పార్టీ కార్యదర్శి జిల్లా యాదగిరి ఆధ్వర్యంలో మాడుగులపల్లి తహసీల్దార్‌కు దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ పార్టీ నల్గొండ నియోజకవర్గ ఇన్చార్జి పబ్బం వీరస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని ప్రభుత్వ పథకాలలో వితంతు ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి ఆపద్బంధు పథకాన్ని వితంతు మహిళలకు వర్తించే విధంగా చూడాలని తహసీల్దార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల కార్యదర్శి అబ్రహం నాయకులు దుర్గమ్మ స్వప్న, మంజుల, మారతమ్మ అబ్బాస్ నాగమ్మ రేష్మ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 4:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తిలోని ప్రభుత్వ పీజీ కాలేజీలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా జిల్లెలచిన్నారెడ్డి మొక్కలు నాటారు. ఈసందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీ శాఖ లెక్కల ప్రకారం 33% అడవులు ఉండాలి కాని, 24శాతం ఉన్నాయి. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని అన్నారు. దానిని పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వంవన మహోత్సవం కార్యక్రమం చేపట్టింది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, నాగార్జున పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** జగిత్యాల పట్టణ 47, 48, 12, 5, 7 వార్డులలో 1 కోటి 36 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధికి సీఎం 50 కోట్ల నిధులు మంజూరు చేయగా అభివృద్ధికి అంచనాలు రూపొందిస్తున్నారని ఆన్నారు. టిఆర్ నగర్ లో 116 మందికి జీఓ 58లో భాగంగా గతంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామ న్నారు. జగిత్యాల పట్టణ పచ్చదనం, పారిశుధ్యం అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్నారు. తడిపొడి చెత్త వేరు రాష్ట్రంలో అన్ని పురపాలక సంఘాల లో అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరు చేయటం జరిగిందన్నారు. పట్టణ ప్రణాళిక మాస్టర్ ప్లాన్‌కు కొందరు కావాలని అడ్డం పడ్డారు. అభివృద్ధికి ఆటంకం కల్పించారన్నారు. ప్రజల మద్దతుతోనే పట్టణం అభివృద్ధి సాధ్యమన్నారు. మోతే చెరువు పారిశుధ్యానికి 3.5కోట్ల నిధులు ఎఫ్ఎస్టీపి లో మంజూరు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన,ఏఓ శ్రీనివాస్, డిఈ వరుణ్, ఏఈ శరన్, అనిల్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు చాంద్ పాషా, దేవేందర్ నాయక్, కుసరి అనిల్, బద్దం లత జగన్, గుగ్గిళ్ళ హరీష్, రేణుక మొగిలి, మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, వార్డు నాయకులు పురుషోత్తం రావు, నాగయ్యా,చేట్పల్లి సుధాకర్. శరత్ రావు, లవంగ రాజేందర్, రాచర్ల విజయ్, శరత్ రావు, యంఏ ఆరిఫ్, శ్రీరామ్ భిక్షపతి, విఘ్నేష్, మున్సిపల్ సిబ్బంది, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్‌డే




**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆన్నారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## కష్టపడుతున్న కార్యకర్తలకు ప్రథమ స్థానం కల్పించాలి

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 4:** ఢిల్లీలో నిర్వహించనున్న బీసీ రిజర్వేషన్ ధర్నా కార్యక్రమానికి హాజర య్యేందుకు రైలు మార్గంలో వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను అదే బోగీలో ప్రయాణిస్తున్న పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు మర్యాదపూర్వకంగా కలిసి వారితో ప్రస్తుత రాజకీయ అంశాల గురించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీకి మొదటి నుంచి కష్టపడుతున్న కార్యకర్తలకు ప్రథమస్థానం కల్పించాలని వారికి విన్నవించుకున్నారు. వారు సానుకూలంగా స్పందించారు.
మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## ప్రతి దరఖాస్తును తక్షణమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ డి వేణు



**జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 4:** జిల్లాలో ప్రజలు సమర్పించిన ప్రతిదరఖాస్తును తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వాటిని పెండింగ్‌లో పెట్టకుండా అత్యున్నత ప్రాధాన్యతతో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వ్యక్తిగతంగా వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన పర్వీన్ అనే మహిళ తన భర్త కుద్భోద్దీన్ ఇటీవల ప్రమాదవశాత్తూ కాలు కోల్పోయారని, కుటుంబ పోషణ కష్టంగా మారిందని విన్నవించింది. సుల్తానాబాద్ పట్టణంలోని మహిళల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్ ఉద్యోగాన్ని అవుట్సోర్సింగ్ ద్వారా తనకు ఇవ్వాలని దరఖాస్తు చేయగా, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అలాగే, కాల్వ శ్రీరాంపూర్ మండలం పోచమ్మకాలనీకి చెందిన జి. రమేష్ అనే దరఖాస్తుదారుడు, తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలంటూ వినతి పత్రం సమర్పించగా, సంబంధిత అధికారికి రాసి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇక నంది మేడారం, గోపాల్రావుపేట గ్రామాల రైతులు, గోలివాడ నుండి గోపాల్రావుపేట వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనులు మధ్యలో ఆగిపోయాయని, వాటిని పూర్తిచేయాలని విజ్ఞప్తి చేయగా, తక్షణమే పనులు పునఃప్రారంభించేందుకు చర్యలుతీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభ్యర్థనలకు అధికారుల నుంచి వేగవంతమైన స్పందన రావాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా తగిన కార్యాచరణ చేపట్టాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, గ్రామ పంచాయతీ, డిఆర్‌డిఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు అన్నప్రాసన




**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** ప్రసవించిన గంటలోపు ముర్రుపాలు తప్పకుండాబిడ్డకు పట్టించాలని ఆ పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అని అన్నారు. సోమవారం తల్లి పాల వారోత్సవాలలో భాగంగా బీర్పూర్ సెక్టార్ లోని నర్సింలపల్లి అంగన్వాడికేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమాన్ని సూపర్వైజర్ శైలజ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత బిడ్డకు ఆరు నెలల వయసు వరకుకేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని ఆ పాలల్లో పోషక విలువలన్ని ఉంటాయని అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల వయసు వర కు తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని అంగన్వాడి సేవలను వినియో గించుకోవాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, స్వప్న, కళావతి, లక్ష్మి, ఆయాలు. తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం అంటే ప్రాణదానం

- కలెక్టర్ జితేష్ పాటిల్
- మణుగూరులో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 4:** రక్తదానం అంటే ప్రాణం దానమని ఈ విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ పేర్కొన్నారు. మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్త నిల్వ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ రిబ్బన్ కటింగ్ చేసి బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానం మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరులకు జీవం పోసే వరంగా మారుతుందన్నారు. గర్భిణీలు తలసేమియా, సికిల్ సెల్, అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారు, ప్రమాదాల వల్ల గాయపడినవారు రక్తం కోసం ముఖ్యంగా ఆధారపడతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మణుగూరులో ఈ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా అత్యవసర పరిస్థితులలో పేషెంట్లకు రక్తాన్ని సమీపంలోనే అందుబాటులోకి తేవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు రక్త అవసరాల కోసం ఖమ్మం భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇకపై ఆ అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డీసీహెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ముందుకు వచ్చి 20 మంది రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పతకాలు సాధించిన ముల్కల్ల గురుకులం విద్యార్థులు



**జనం పవర్, మంచిర్యాల, ఆగస్టు 4:** మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మారయ్య ఆధ్వర్యంలో మంచిర్యాల గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానంలో నిర్వహించిన మాడల్ జావీలైన్ డే, జిల్లాస్థాయి క్రీడా పోటీలలో మంచిర్యాల (ముల్కల్ల) గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. జనగాం స్టేడియంలో ఆగస్టు 7న జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన వీరికి సోమవారం అభినందన సభ ఏర్పాటు చేసి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు ఈ సభలో విద్యార్థులను అభినందించారు.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బి.కార్తీక్ (10 సం.ల విభాగంలో) 60మీ. స్టాండింగ్ బ్రాడ్ జంప్ రజతం పతకం, రిత్విక్ 60మీ. స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఏ. ఉల్లాస్ (16 సం.ల విభాగంలో) జావలిన్ త్రో బంగారు పతకం, పీడీ కుమ్మరి శ్రీకాంత్, పీఈటీ మారెపాక సాగర్‌లను అభినందించి క్రీడలతో జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ కే. మోహన్ కోరారు.

## స్కూటీ డిక్కీలోని రూ.5 లక్షలు చోరీ

**జనం పవర్, భైంసా, ఆగస్టు 4:** భైంసా పట్టణ కేంద్రంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన బొంబోతుల ఆనంద్ అమెరికాలో ఉంటున్న తన కూతురు పంపిన డబ్బును బ్యాంకు నుంచి డ్రా చేసుకొని వెళ్తుండగా ఓ రెస్టారెంట్ దగ్గర ఈ ఘటన జరిగింది. సోమవారం ఉదయం తన గ్రామం నుంచి స్కూటీపై భైంసాకు వచ్చిన ఆనంద్ స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.5 లక్షలు డ్రా చేసుకున్నాడు. ఆనంతరం స్కూటీ డిక్కీలో పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు. భైంసా పట్టణ సరిహద్దులో నున్న ఓ రెస్టారెంట్ వద్ద తన స్కూటీని నిలిపి భోజనం కోసం వెళ్ళాడు. అదే సమయంలో ఇద్దరు అగంతకులు ద్విచక్ర వాహనంపై అక్కడికి చేరుకొని, స్కూటీ దగ్గరికి వెళ్లి డిక్కీ తెరిచి అందులో నుండి రూ.5 లక్షలు అపహరించి వెళ్లిపోయారు. భోజనం ముగించుకుని తిరిగి తన స్కూటీ దగ్గరికి వచ్చి డిక్కీలో ఉన్న డబ్బులు చోరీ అయినట్టు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భైంసా టౌన్ సీఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి దొంగలు నిజామాబాద్ మార్గం వైపు వెళ్లినట్టు గుర్తించారు. దొంగలను త్వరలోనే పట్టుకొని బాధితునికి న్యాయం చేస్తామని సీఐ తెలిపారు.

## చోరీకి గురైన 70 సెల్‌ఫోన్లు అందజేత



**జనం పవర్, భైంసా, ఆగస్టు 4:** మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడిన ఆందోళన చెందవద్దని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, దొంగిలించబడిన 70 సెల్‌ఫోన్లను (8.40 లక్షల విలువైన) స్వాధీనం చేసుకొని సంబంధిత బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను వినియోగించే వారు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోగొట్టుకున్న ఫోన్ బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఫోన్ తీసుకున్నప్పుడు సంబంధిత రిసీట్‌ను దగ్గర ఉంచుకోలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల, ఫోన్ బాధితులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో పీయూసీ-1 తరగతులు ప్రారంభం

**జనం పవర్, భైంసా, ఆగస్టు 4:** నూతన అకాడమిక్ ఇయర్ బాసర, మహబూబ్ నగర్ ఐఐఐటీకి సంబంధించిన పీయూసీ-1 తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయని, పూర్తి సమాచారం త్వరలో విడుదల చేస్తామన్నారు. అత్యవసర అప్ డేట్స్, సమాచారం తెలుసుకోవడానికి యూనివర్సిటీ అధికార వెబ్సైట్ www.rgukt.ac.inను సందర్శించాలని క్యాంపస్ వీసీ గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజావాణిలో కలెక్టర్‌కు మాజీ మంత్రి వినతి



**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుండి మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. లబ్ధిదారులకు గతంలో కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కాగితాలను కలెక్టర్‌కు మాజీ మంత్రి జీవన్ రెడ్డి అందజేశారు. అనంతరం మాజీ మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2008లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసిందని, డబుల్ బెడ్రూమ్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన లబ్ధిదారులకు అందరికీ ఇల్లు మంజూరు చేయాలన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వివిధ దశల్లో ఉన్న 1611 ఇళ్లను పరిశీలించి రూ.52 కోట్లు అవసరమవుతాయని నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. 3500 ఇల్లు కేటాయించి రెండేళ్లు గడుస్తున్న కేవలం 500 మంది మాత్రమే ఇళ్లలోకి చేరారని, మిగిలిన వారు సైతం ఇళ్లలోకి వెళ్లేందుకు గడువు విధించాలని కోరారు. పాఠశాల, ప్రార్థన మందిరాలు నిర్మించాలని సూచించారు. 2008లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేసేందుకు ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జగిత్యాల్ పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు భూసేకరణ చేపట్టి 4000 మందికి ఇల్లు కేటాయించిందన్నారు. 4000 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన ఇళ్లలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధులు కేటాయించకుండా నిర్మాణాలను నిలిపి వేసిందన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తుందో అని వివిధ దశల్లో ఉన్న 2000 ఇళ్లను కూల్చివేసి, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం తెర పైకి తీసుకు వచ్చారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇల్లు కూల్చివేయడంతో నిరాశ్రులయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుపేదల్లో ఆశలు చిగురించాయన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణంలో ఇల్లు కోల్పోయామని, ఇళ్ల మంజూరిలో ప్రాధాన్యత ఇచ్చి, ఇల్లు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారని అన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకంలో కేటాయించిన ఇళ్లలో 1611 ఇల్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం, తాగునీటి సదుపాయం కోసం నిధులు కేటాయించిందన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే ఇళ్ల నిర్మాణాలు పరిశీలించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయగా, నిర్మాణాలు పూర్తి చేసేందుకు రూ.52 కోట్లు అవసరమవుతాయని కలెక్టర్ నివేదిక సమర్పించారన్నారు. 3500 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించి 20 నెలలు గడుస్తున్నా, ఎన్నికలకు ముందుగా ఎటువంటి మౌలిక వసతులు కల్పించకుండా ఇల్లు కేటాయించారన్నారు.

సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి మౌలిక వసతుల కల్పన కోసం నిధులు మంజూరు చేశారన్నారు. 3000 మంది లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్లలోకి చేరాల్సిన అవసరం ఉందన్నారు. ప్రార్థన మందిరాల కోసం దాదాపు 20 ఎకరాలు ఖాళీ స్థలం ఉందని, ఆలయ నిర్మాణం, మసీదు, చర్చ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందని జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన




**జనం పవర్, భైంసా, ఆగస్టు 4:** భైంసా మండలంలోని దేగాం గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం మాదకద్రవ్యాల వినియోగంపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా జడ్జి రాధిక మాట్లాడుతూ విద్యార్థులు మత్తులో పడి బంగారు భవిష్యత్తును, మంచి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒకసారి మాదిగ ద్రవ్యాలు అలవాటైతే వారి జీవితంతో పాటు కుటుంబం నాశనమవుతుందని, అలా కాకూడదంటే విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిస కాకూడదని అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ నైలు, భైంసా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఆకాష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, భైంసా ఎంఈఓ సుభాష్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్**





**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 4:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హౌసింగ్ పీడీ రవీందర్ నాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపించారు.

రామవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చిట్టి రామవరం తండా 19వ డివిజన్‌లో నివసిస్తున్న గిరిజన లంబాడి పోడు రైతులు కొంతమంది సర్వే నెం.20 లో గల ఆర్వోఎఫ్ఆర్ అటవీ శాఖ పోడు భూములను గత 40 సంవత్సరాలుగా పూర్వీకుల నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. గతంలో 340 మంది పోడు రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేయగా అందులో 97 మంది రైతులకు మాత్రమే పట్టాలు మంజూరు అయ్యాయని మిగిలిన వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

చంద్రుగొండ మండలం వెంకట్య తండా పంచాయతీ పరిధిలోని కరశలబోడు తండాలో నివసిస్తు పోడు వ్యవసాయం చేస్తున్న రైతు ధారావత్ లక్ష్మిబాలు ప్రభుత్వ అనుమతితో బోరు వేసుకున్నామని అట్టి బోరుకు విద్యుత్ కనెక్షన్ కొరకు 200 మీటర్లు ఉన్న ట్రాన్స్ఫారం నుండి తీసుకునేందుకు అనుమతించాలని కోరుతూ దరఖాస్తు చేశారు.

పాల్వంచ మండలం జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పెనుగొండ రాజేశ్వరి, వీర కుమార్ భార్యాభర్తలు వివిధ కారణాల చేత విడిపోవడం జరిగిందని, రామానుజవరంలో సర్వేనెం.853లో సుమారు 0.20 గుంటల భూమిని తనకు రాసి ఇవ్వడం జరిగిందని ఫిర్యాదులో తెలిపారు. అట్టి భూమి మణుగూరు సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా భూసేకరణకు గురవుతున్నందువలన తనకు రాసిచ్చిన భూమి నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా దరఖాస్తును చేశారు.

ఇల్లందు రెండవ నెంబర్ బస్తీలో నివాసం ఉంటున్న సిలువేరు చంద్రావతి తాను ఒంటరి మహిళలను అని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేశారు.

చర్ల మండలం చర్ల గ్రామంలో నివాసం ఉంటున్న భోగాల శివ తన తాతగారైన కొండమల్ల నరసింహారావు వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తూ చనిపోయారని తెలిపారు. తన తాతగారి ఉద్యోగం తమ కుటుంబానికి ఏ విధమైన సంబంధం లేనటువంటి వ్యక్తి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, పూర్తి విచారణ జరిపి న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో
## కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి

**- బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి**

**జనం పవర్, హాజీపూర్, ఆగస్ట్ 4:** బీజేపీ మహా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హాజీపూర్ మండలం పడ్తాన్‌పల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి పీఎం నరేంద్ర మోదీ గత 11 సంవత్సరాలుగా పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల రోడ్ల అనుసంధానం, ప్రతి ఇంటికి మరుగు దొడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 20 నెలల పాలనలో ఎన్నికల సమయంలో హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళకు నెలకు రూ.2500లు, నిరుద్యోగ యువతకు రూ.4000లు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, కౌలు రైతులకు రూ.12 వేలు వంటి అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని అన్నారు. హాజీపూర్ మండలంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధిత ప్రజలకు ఇప్పటి వరకు ప్రభుత్వం పరిహారం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజలు భూములు ఇచ్చి 20 ఏండ్లు గడుస్తున్నా ఇంతవరకు పరిహారం అందించలేదని అన్నారు. గత ఏడాది గోదావరి అవతలి వైపు ఉన్న వెల్గటూరు మండలంలో రూ.18 కోట్లు ముంపు బాధితులకు అక్కడ ఎమ్మెల్యే ఇప్పించారని అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్యేకు మాత్రం ముంపు బాధితులు అంటే పట్టింపు లేదని, వారికి నష్ట పరిహారం ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి రెడ్డి, ఎనగందుల కృష్ణమూర్తి, గాజుల ముఖేష్ గౌడ్, బియ్యాల సతీష్ రావు, మాధవరపు వెంకట రమణ రావు, మడిపెల్లి సత్యం, హనుమండ్ల శ్రీనివాస్, కొట్టే ప్రశాంత్, రాజనర్సు, అయిలవేని సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



**జనం పవర్, భైంసా, ఆగస్టు 4:** ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచించారు. ఎలాంటి సమస్య ఉన్న చట్టాన్ని చేతిలో తీసుకోకుండా అధికారులకు విన్నవించాలని ప్రజలకు సూచించారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను పట్టించుకోకుంటే కలెక్టరేట్లో ఫిర్యాదు ఇవ్వాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మేమంతా ఉన్నామని అన్నారు. మీరు ధైర్యంగా భయపడకుండా వచ్చి అర్జీలను ఇవ్వచ్చునని అన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పలు సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# కౌకొండ-అంబాల రోడ్డు పూర్తయ్యేదెప్పుడు..?

**- ముందుకు సాగని పనులు - కాంట్రాక్టర్ నిర్లక్ష్యం - పట్టించుకోని అధికారులు**




**జనం పవర్, నడికూడ, ఆగస్టు 4:** హన్మకొండ జిల్లా నడికూడ మండలంలోని కౌకొండ నుంచి అంబాల రోడ్డు పనులు ముందుకు సాగడంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని, పనుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఇటీవల ధర్మ సమాజ్ పార్టీ నడికుడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆ పార్టీ శ్రేణులు మరోమారు వాట్సాప్ గ్రూపుల్లో గ్రామ సమస్యలపై చర్చ జరిపారు. దీంతో ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్‌తో తాను మాట్లాడానని, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో కాంగ్రెస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కాని ఎమ్మెల్యే హామీ ఇచ్చి వారం రోజులు అవుతున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. కౌకొండ గ్రామ రోడ్డుకు గ్రహణం పట్టిందా? గ్రామ నాయ కుల నిర్లక్ష్యమా అని స్థానిక గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కౌకొండ గ్రామంలో వివిధ పార్టీల నాయకులు ఉన్నప్పటికీ ఎలాంటి లాభం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. పక్క గ్రామాల రోడ్లు చూస్తుంటే ఆనందమేస్తుంది. తమ గ్రామ నాయకుల నిర్లక్ష్యమే గ్రామానికి శాపంగా మారిందా అనే రీతిలో ప్రజలు ఉన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న మన గ్రామానికి కావాలి అని అడిగే సాహసం చేయకపోవడమే ఈ గ్రామ ప్రజలు చేసుకున్న పాపమా? ఎవరైనా గ్రామానికి సంబంధించిన పనులపై ప్రశ్నిస్తే కూటమిగా ఏర్పడి ప్రశ్నించే వారిని అణగదొక్కడంలో గ్రామ నాయకులు ముందే ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ తక్షణమే స్పందించి కౌకొండ గ్రామానికి ఉన్న లింకు రోడ్లు కౌకొండ -ధర్మారం, వెలంపల్లి, పోచారం, కంటా త్మకూర్ నూతన రోడ్లు నిర్మించాలని కాంట్రాక్టర్, ఆర్ అండ్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

**- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్**



**జనం పవర్, నడికూడ, ఆగస్టు 4:** ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల నుంచి బిల్లులు రావడం లేదన్నారు. వీరికి ఏడు నెలల నుంచి ఎగ్గ బిల్లుఉ రాక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారి చెవుల కమ్మలు, తాలిపుస్తలు కుదువపెట్టి విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోఆరు. నడికూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మూడేళ్ల క్రితం ప్రైమరీ స్కూల్లో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసి విద్యార్థులను హైస్కూల్‌కు పంపారన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు సౌకర్యాలు లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో ఆఫీస్‌ని అక్కడి నుంచి తొలగించి విద్యార్థుల ఇబ్బదులు తొలగించాలన్నారు. లేనిచో నడికూడ మండలంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 4:** సైబర్ వారియర్స్ సైబర్ నేరాల నియంత్రణ గురించి కృషి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదేశించారు. సోమవారం ఆమె తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి వచ్చిన టీషర్ట్‌లను సైబర్ వారియర్స్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తక్కువ కాలంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని, పార్ట్ టైం జాబ్స్ తదితర పేరిట సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రజలు వాటి బారీన పడకుండా తీసుకవాల్సిన జాగ్రత్తలును వివరించాలన్నారు. పోలీస్ శాఖ సైబర్ నేరాల నియంత్రణ కోసం బాధితులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో జరిగే సైబర్ నేరాలను నియంత్రించేందుకు పోలీస్ స్టేషన్ వారీగా వారియర్స్ కృషి చేయాలన్నారు. సైబర్ కేసుల్లో పూర్తి స్థాయి ఆధారాలు సేకరించి నేరస్తులను గుర్తించటం, నేరగాళ్లకు శిక్ష పడేలా చేయడం, బాధితులకు న్యాయం చేయడాన్ని సైబర్ వారియర్స్ చాలేంజ్ గా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లాలోని సైబర్ వారియర్స్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు కృషితోనే సిద్దిపేట అభివృద్ధి

**- మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు**



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 4:** రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కృషితోనే సిద్దిపేట పట్టణం అభివృద్ధి చెందిందని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు అన్నారు. సోమవారం ఆమె వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట అభివృద్ధి ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే జరిగిందన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ ఒక దిక్సూచి వంటిదన్నారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ గుర్తుపై గెలిచిన కొంతమంది కౌన్సిలర్లు అధికారంలో పోగానే పార్టీ మారరన్నారు. వారే బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం బాధాకరమన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని కొంతమంది కౌన్సిలర్ల ఆరోపణలు పూర్తిగా అవస్తవమన్నారు. ఆధారాలు ఉంటే వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీ పేరు, ప్రతిష్టలకు ఎవరు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు సేవచేయడానికి పాలకవర్గం ఎప్పుడు ముందుంటుందని చెప్పారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు మాట్లాడుతూ పట్టణ కౌన్సిలర్లు ఇష్టానుసారంగా మాట్లాడవద్దని సూచించారు. వారి పద్ధతులు ఇప్పటికైనా మార్చుకోవాలన్నారు. అటువంటి వారిపై స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టికి తీసుకెళామన్నారు. ఆయన నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. పట్టణంలో నూతనంగా ఇల్లు నిర్మించుకునే వారందరు కచ్చితంగా మున్సిపల్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రజలకు సేవచేయడానికి పాలకవర్గం ఎప్పుడు ముందుంటుందన్నారు. మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.

# గద్దర్ స్మృతి వనాన్ని నిర్మించాలి

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 4:** పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన గద్దర్ స్మృతి వనాన్ని నిర్మించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే గద్దర్ రెండో వర్ధంతి పోస్టర్‌ను సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో గద్దర్ స్మారకంగా స్మృతి వనాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి హీమీ ఇచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికి నిర్మించలేదన్నారు. గద్దర్ ఫౌండేషన్‌కు 3 కోట్లు సహాయం అందజేయడానికి ప్రభుత్వం జీఓ ఇచ్చి నేటికి నిధులను విడుదల చేయలేదన్నారు. సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ చైర్మన్ శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు అనేక ఉద్యమాలను నిర్మించిన గద్దర్ రెండవ వర్ధంతిని ఈ నెల 6న మధ్యాహ్నం రెండు గంటల నుంచి గద్దర్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో సబ్బండ వర్గాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసొసియేట్ అధ్యక్షుడు జి.తిరుపతి రెడ్డి, తెలంగాణ



ప్రజా ఫ్రంట్ నాయకులు జి.సత్తయ్య, ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆస లక్ష్మణ్, బొయ సంఘం నాయకులు బొయ రాములు, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొతరాజు శంకర్, ప్రవీణ్, యాదవ విద్యా వంతుల నాయకులు రాజు, రాము యాదవ్, లడ్డు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేటలో గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా పోచబొయిన శ్రీ హరి యాదవ్, వైస్ చైర్మన్‌గా ఆస లక్మణ్‌ను ఎన్నుకున్నారు. అన్ని సంఘాల, పార్టీల నాయకులు, మేధావులతో కమిటీ ఏర్పాటు చేశారు. సిద్దిపేట లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని కమిటీ నేతలు తెలిపారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



**జనం పవర్, నడికూడ, ఆగస్టు 4:** లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని కౌకొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల రమేష్ అన్నారు. మండల పరిధిలోని కౌకొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం హనుమకొండ లయన్స్ క్లబ్ కనకదుర్గ 320ఎఫ్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ పాఠశాలలకు బడుగు, బలహీనవర్గాల పిల్లలు ఎక్కువ మంది వస్తున్నారని, వారికి ఇటువంటి ప్రోత్సాహం ద్వారా గుణాత్మకమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని కోరారు. దీనికి సమాజ భాగస్వామ్యం అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధి డి.సులోచన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఐదు రకాలుగా లయన్స్ క్లబ్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి లయన్స్ ముందుంటుందని ప్రతినిధులు వనజ, శశికళ, ఉమాదేవి తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయుడు మనోహర్, లావణ్య, సాంబరాజు, సర్దార్, మనోరమ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీకి పెద్ద ఎత్తున తరలిరావాలి



**జనం పవర్, వరంగల్, ఆగస్టు 4:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 6న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో పాటు బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పీసీసీ గీత సెల్ సెక్రెటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్‌ను సాధించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. బీసీ బిల్లు సాధనకు ఎమ్మెల్సీ కవిత నిరాహార దీక్ష చేసే నైతిక అర్హత లేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 4:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మ డల ఏపీఎంగా బత్తిని పరశురాములు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పరశురాములు చిన్న కోడూరు మండలంలో స్వీప్ ఏపీఎంగా పనిచేసి బదిలీపై బెజ్జంకి వచ్చారు. బెజ్జంకి ఏపీఎంగా పనిచేసిన జీ నర్సయ్య జగదేవ్‌పూర్ మండలానికి బదిలీపై వెళ్లారు.

## సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 4:** మేడ్చల్ జిల్లాలో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ ఈ మహాసభలకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, విద్యార్థి యువజన, కార్మిక కర్షక నాయ కులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వందేళ్ల సుదీర్ఘమైన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు, పండుగ పరశురాములు, పొట్లపల్లి బాబు, దొంతర వేణి మహేష్, రొడ్డ చరణ్, క్రావుల నర్సయ్య, రొడ్డ లక్ష్మణ్, బుర్ర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హరిత పాఠశాల ర్యాంకింగ్‌కు
# యునిసెఫ్ సహకారం అవసరం



### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 4:** జిల్లాలో స్వచ్ఛత హరిత పాఠశాలల ర్యాంకింగ్, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి యూనిసెఫ్ సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం యూనిసెఫ్ బృందంతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సంక్షేమం, సుస్థిర పారిశుధ్యం, పరిశుభ్రత తదితర అంశాలతో పాటు జాతీయస్థాయిలో స్వచ్ఛత హరిత పాఠశాలల ర్యాంకింగ్ మెరుగుపరి చేందుకు సహకారం అవసరమని అన్నారు.జిల్లాలో విద్య, వైద్యం, అంగన్వాడిలలో చేపట్టే సేవా కార్యక్రమాలకు యూనిసెఫ్ సహకారం ఉంటుందని బృందం సభ్యులు తెలిపారు. జిల్లాలో యూనిసెఫ్ సహకారంతో చేపట్టిన పారిశుధ్య కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను గురించి ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో వివరించిన కలెక్టర్‌ను యూనిసెఫ్ బృందం సన్మానించింది. సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ వెంకటేష్, ఫణీంద్ర, జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి, సమన్వయకర్తలు రమేష్, వేణు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

**జనం పవర్, జమ్మికుంట ఆగస్టు 4:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో గల మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 83 మంది విద్యార్థినిలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దగ్గు,జలుబు సమస్యలు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న నలుగురు విద్యార్థినిలకు రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. డా సంధ్యారాణితో హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

### హలో బీసీ...ఛలో ఢిల్లీ

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆగస్టు 6వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీ గర్జనకు, జమ్మికుంట, ఇల్లందకుంట దేవస్థానం చైర్మన్ రామా రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# తెలంగాణలో అరుదైన స్వయంభూ ఆదివరాహ క్షేత్రం

- ఆలయం లేని ఆధ్యాత్మిక ఆరాధన స్థలం
- ప్రతి ఏటా పెరుగుతున్న విగ్రహం
- జయంతి ఉత్సవాలు ఆగస్టు 5 నుంచి 7 వరకు





**జనం పవర్, పెద్దపల్లి, ఆగస్టు 4:** హిందూ మతపరంపరలో శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో మూడవదైన వరాహావతారం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. భూదేవిని జలప్రళయంలో నుంచి రక్షించేందుకు మహావిష్ణువు వరాహ రూపం ధరించి కోరలపై భూమిని ఎత్తినట్టు పురాణ గాథలు వివరిస్తున్నాయి. ఈ అవతారానికి గుర్తుగా నిర్మించిన ఆలయాలు దేశంలో చాలానే ఉన్నప్పటికీ, మన తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా మాత్రమే కనిపిస్తాయి. రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని ఆదివరాహ స్వామి క్షేత్రం ఓ విశిష్టమైన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. ఆలయం లేకుండానే బండరాయిపై స్వయంభువుగా వెలసిన ఈ విగ్రహం భక్తులలో గాఢమైన నమ్మకాన్ని కలిగిస్తోంది. ప్రతి ఏటా విగ్రహ పరిమాణం కొద్దిగా పెరుగుతోందన్న విశ్వాసం అక్కడి భక్తుల మధ్య ఉన్నత స్థాయిలో ఉంది. స్థానిక స్థలపురాణం ప్రకారం, సుమారు 600 సంవత్సరాల క్రితం ఓ మహర్షికి స్వామి కలలో దర్శనమిచ్చి, అదే చోట స్వయంభువుగా వెలిశారనిచెబుతున్నారు. ఆలయం లేకుండానే, బహిరంగంగా ఉన్న ఈ విగ్రహాన్ని భక్తులు "గుడి లేని దేవుడు"గా ఆరాధిస్తున్నారు. ఎలుక ఆకారంలో కనిపించే స్వామి విగ్రహంపై సహజంగా వెంట్రుకలు పెరిగినట్టు ఉండడమూ మరో ప్రత్యేకతగా చెప్పుకుంటారు. అలాగే స్వామి నడకచొప్పున పాదాల ఆనవాళ్లు పక్కనే ఉన్న మరో రాయిపై కనిపించడం కూడా భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇందులో మరొక విశేషం ఏమిటంటే, ఈ విగ్రహానికి ఎలాంటి శిల్ప కళా ప్రక్రియలు నిర్వహించకుండా సహజసిద్ధంగా ఏర్పడింది. ఈ కారణంగానే ఇక్కడి భక్తులు ఈ దేవస్థానాన్ని ప్రత్యక్ష దైవ దర్శనంగా భావిస్తూ భక్తిశ్రద్ధలతో పూజించుకుంటున్నారు.

### భక్తుల కోరికలు తీర్చే వరాల స్వామి..

ఇక్కడి స్వామివారిని "వరాల స్వామి"గా పిలవడం వెనుక ఒక విశేషత ఉంది. ఎందుకంటే ఇక్కడ ముడుపులు కట్టిన భక్తుల కోరికలు తీరుతున్నాయన్నారు. స్వామివారి పాదాల వద్ద నిత్యం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అన్నదాన కార్యక్రమాల ద్వారా తమ భక్తి, శ్రద్ధను చాటుతున్నారు. ప్రత్యేకంగా భూ వివాదాల్లో చిక్కుకున్న వారు స్వామిని మొక్కి ముడుపు కడితే సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయని నమ్మకం ఉంది. కోర్టుల చుట్టూ తిరుగుతూ మానసికంగా కుంగిపోయిన భక్తులు, ఈ క్షేత్రంలో స్వామి సన్నిధిని ఆశ్రయించి శాంతిని పొందడమే కాకుండా, అనూహ్యంగా తమ వివాదాలు కూడా పరిష్కారమవుతున్నాయని చెబుతున్నారు.

### జయంతి వేడుకలు ఈనెల 5 నుండి 7 వరకు

ప్రతి ఏటా స్వామివారి జయంతిని పురస్కరించుకుని మూడు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఆగస్టు 5 నుంచి 7 వరకు జరుగనున్న ఆదివరాహ స్వామివారి జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి. ఆగస్టు 5న ఉదయం 8:30 గంటలకు నిత్యాభిషేకం, గోపూజ, తీర్థప్రసాద గోష్ఠితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 10:00 గంటలకు గృహ భూ సమస్యల నివారణకు మరియు సర్వకార్య సిద్ధికి ఆదివరాహ హవనంతో పాటు తీర్థ,ప్రసాద గోష్ఠి నిర్వహించబడుతుంది. ఆగస్టు 6 బుధవారం ఉదయం 8:30 గంటలకు నిత్యాభిషేకం, గోపూజ, తీర్థప్రసాద గోష్ఠి జరుగుతుంది. అనంతరం ఉదయం 10:00 గంటలకు శ్రీ భూ ఆదివరాహ స్వామివారి కళ్యాణ మహోత్సవం వివాహ సంబంధ సమస్యల నివారణ కోసంగా జరుగనుంది. మధ్యాహ్నం 12:30 గంటలకు నిత్య పూర్ణాహుతి, తీర్థ,ప్రసాద గోష్ఠి, సాయంత్రం 6:00 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి, తీర్థ,ప్రసాద గోష్ఠి నిర్వహించబడతాయి. ఆగస్టు 7న ఉదయం 5:30 గంటలకు సుప్రభాతం, తిరువారాధన, సేవాకాలం, 8:30 గంటలకు నిత్యాభిషే కం, గోపూజ జరుగుతుంది. అనంతరం ఉదయం 9:00 గంటలకు వరాహ జయంతి సందర్భంగా 108 కలశాల తో అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం జరగనుంది. రాత్రి 9:00 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు ము గించబడతాయి.

### కమాన్‌పూర్ చేరుకోవడం సులభం

కమాన్‌పూర్ ఆదివరాహ క్షేత్రం చేరుకోవడం సులభమే. కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి నుంచి కమాన్‌పూర్‌కు బస్సులు, ఆటోలు నిత్యం అందుబాటులో ఉన్నాయి. అలాగే పెద్దపల్లి రైల్వే స్టేషన్ ఈ క్షేత్రానికి అత్యంత సమీపంగా ఉండటం వల్ల భక్తులు అక్కడి నుంచి స్థానిక రవాణా ద్వారా ఆలయానికి చేరవచ్చు.

### ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి : ఈవో కే కాంతారెడ్డి



కమాన్‌పూర్‌లోని ఆదివరాహ స్వామి స్థలం ఒక అరుదైన విశిష్ట వరాహక్షేత్రంగా ప్రముఖతను సంతరించుకుంది. రేపు నిర్వహించే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడేందుకు పోలీస్ శాఖ, గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖ, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టామని,అన్ని అవసరమైన సదుపాయాలు సిద్ధం చేసినట్లు దేవాలయ ఈవో కే. కాంతారెడ్డి తెలిపారు.

# క్రీడలు మానసిక ఆనందాన్నిస్తాయి

### ఎస్పీ రావుల గిరిధర్




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 4:** క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఆనందాన్ని స్తాయని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.వనపర్తి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికలకు ఓపెన్ చెస్ ఛాంపియన్షిప్ వనపర్తి పట్టణంలోని స్పోర్ట్స్ కార్యాలయంలో 4 రోజులుగా నిర్వహిస్తున్న చదరంగం పోటీలలో భాగంగా ఆదివారం రోజు పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని వికాసాన్ని కలిగిస్తాయని చదరంగం(చెస్) లాంటి ఆట ఆలోచనా శక్తిని పెంచడమేగాక మెదడుకు పదును పెడుతుందని అన్నారు. చెస్ ఆటపై పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆసక్తిని పెంచాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఈ పోటీలో 180 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీ యమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఒక్క రోజు మాత్రమే జరిగిన ఆటలో ఆరు రౌండ్లలో ఎనిమిది మందిని విజేతలుగా ఎంపిక చేసి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, లోకనాథ్ రెడ్డి నిర్వాహకులు, యాదగిరి, టి.పి. కృష్ణయ్య, గణేష్ కుమార్, నరసింహ, వేణుగోపాల్, విద్యార్థులు చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ

సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల యొక్క ఎస్సైలకు, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, పోలీసు శాఖ పని చేస్తుందని ఎస్పీ రావులగిరిధర్ తెలియ జేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

## పంచాయతీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

### పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి

**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 4:** సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోతో ఫేస్ రికగ్నిజేశన్ యాప్‌లో హాజరు వేసుకున్నారనే ఆరోపణతో బుగ్గారం మండలం చందయపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయగాపంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ సస్పెన్షన్‌కు గురైన పంచాయతీ కార్యదర్శి రాజన్నకు మరో గ్రామ పంచాయతీ అయిన సిరికొండకు కూడా ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆ సమయంలో చందయ్యపల్లిలో నిర్ణీత సమయంలోగా అటెండెన్స్ వేయాల్సి ఉండగా అక్కడి గ్రామ సహాయకునికి అటెండెన్స్ వేయమని చెప్పడం వల్ల ఈ పొరపాటు జరిగిందని, ఇది కావాలని చేసిన పొరపాటు కాదని,మొదటితప్పుగా భావించి పంచాయతీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూలై 1, 2 తేదీలలో సిరికొండలో విధుల్లో హాజరైన రాజన్న తన సహాయకుడికి చందయ్యపల్లిలో అటెండెన్స్ వేయమని చెప్పడం వల్ల అతనికి ఫేస్ రికగ్నేషన్ యాప్‌పై అవగాహన లేకపోవడంతో పొరపాటున సీఎం ఫోటో అప్లోడ్ అయిందని వివరణ ఇచ్చారు. గత 18 నెలలుగా గ్రామ పంచాయతీలకు కేంద్ర నిధులు గాని, రాష్ట్ర నిధులు గాని రాకపోయినప్పటికీ తమ సొంత డబ్బులతో గ్రామ పంచాయతీకి సంబంధించిన అత్యవసర సేవలను అందిస్తున్నామన్నారు. తాము ఖర్చుపెట్టిన బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు, పని భారం, ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు పడుతూ కూడా 98 శాతం మంది కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారని ఎవరో కొంతమంది చేసిన తప్పిదానికి పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థను తప్పు పట్టడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా బాధ్యులు శ్రీకాంత్, సతీష్ కుమార్, రాజు, రవి తోపాటు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ ఎన్ కిమ్యా నాయక్

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 4:** భూభారతి చట్టం 2025 రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ ఎన్. కిమ్యా నాయక్ తహశీల్దార్లను ఆదేశించారు. సోమవారం భూ సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ సదస్సు ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీస్ అనంతరం పరిష్కరించదగిన దరఖాస్తులను ఆన్లైన్ భూభారతి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. తహసిల్దార్ లాగిన్ ద్వారా పరిష్కారం అయ్యే మ్యుటేషన్, సక్సేషన్ దరఖాస్తులు పరిష్కరించి అప్లోడ్ చేయాలన్నారు. ఆర్డీఓ లాగిన్ కు పంపాల్సినవి ఆర్డీఓ లాగిన్ కు అదనపు కలెక్టర్ లేదా కలెక్టర్‌కు పంపించాల్సిన దరఖాస్తులు తగిన ఆధారాలు, రికార్డులతో పంపించాలని ఆదేశించారు. వారం రోజు ల్లో గణనీయ మైన ఫలితం కనిపించాలని అత్యధిక సంఖ్యలో పరి ష్కారం కావాలని నిర్దేశించారు.ఆర్డీఓ సుబ్రమణ్యం, పరిపాలన అధికారి భాను ప్రకాష్, డి. సెక్షన్ సూపరిండెంట్ మదన్ మోహన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల్లోనే
## వివాహ - మార్కెట్ విలువల ధృవీకరణ పత్రాలు




**జనం పవర్, మంథని, ఆగస్టు 4:** ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే వారికి అవసరమైన సర్టిఫికెట్లను జారీ చేయడంలో మీ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముందుగా అవసరమైన వినియోగదారుడు సంబంధిత అధికారి వివరాలను ధ్రువీకరించిన అనంతరం మీసేవలో అప్లై చేస్తారు. ప్రాసెస్ అనంతరం ధృవీకరణ పత్రాలు మీసేవ కేంద్రాలలో జారీ చేయబడుతున్నాయి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 22 శాఖలకు సంబంధించిన 482 వివిధ రకాల సర్వీస్ లను ఒకే చోట లభిస్తుండడంతో ప్రజలకు వెసులుబాటు కలిగి కార్యాలయం చుట్టూ తిరిగే ఇబ్బందులు దూరమయ్యాయి.మరో రెండు సర్వీసులు అందుబాటులోకి తాజాగా మరో రెండు కీలక సర్వీస్ లను మీసేవ జాబితాలో పొందుపరిచారు.వివాహ ధ్రువీకరణ పత్రం, మార్కెట్ విలువ సర్టిఫికెట్లను మీ సేవల ద్వారా పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. జనాభా ప్రాతిపదికన జిల్లా, మండల, గ్రామస్థాయిలో ప్రజలకు వివిధ రకాల సర్వీస్ లను అందించేందుకు మీసేవ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం మీ సేవ కేంద్రాలు రెవెన్యూ, పురపాలక, పంచాయతీ రాజ్ తదితర శాఖల సేవలు అందిస్తూ, పలు ధ్రువీకరణ పత్రాల జారీ చేస్తున్నాయి. తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ జారీచేసే వివాహ ధ్రువీకరణ, వ్యవసాయేతరయేతర భూముల మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలను ఈ కేంద్రాలలో పొందే వెసులుబాటు కల్పించింది.

## మహిళలు సమైక్యంగా పోరాడాలి

**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 4:** మహిళలందరూ సమైక్యంగా ధైర్యంగా ముందుకు సాగాలని మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ గిరి రమ అన్నారు. సోమవారం నకిరెకంటి స్వప్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా సమైక్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, మహిళలపై జరిగే అరాచకా లను అరికట్టాలంటే మహిళలందరూ సమైక్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు స్త్రీలకు చెందడంలో విఫలమవ్వడానికి కారణం మహిళలకు చైతన్యం లేకపోవడమే అనిఅన్నారు. మహిళా సమైక్య గ్రామ కమిటీ నిర్మాణం సోమవారం ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గిరీ రమ మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. గ్రామ మహిళా సమైక్య కార్యదర్శిగా నకిరేకంటి స్వప్న, అధ్యక్షురాలుగా గంటకావేరి, సహాయ కార్యదర్శిగా నాగమణి, నాగమ్మ, రేష్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ కార్యక్ర మంలో మిర్యాలగూడ టౌన్ కార్యదర్శి షమీంమండల కార్యదర్శి అబ్రహం, వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, గంటలక్ష్మీ, గంట మంగమ్మ, ఆరూరి, లక్ష్మమ్మ, మున్నిభీ, షహీదా, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## హిందువులకు వేరుగా ఇండ్లు కేటాయించాలి



**జనం పవర్, జగిత్యాల,ఆగస్టు 4:** ప్రజావాణి కార్యక్రమంలో భారత్ సురక్ష సమితి నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. భారత్ సురక్ష సమితి నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద, బడుగు బలహీన వర్గాల కోసం నూకపెల్లి వద్ద ఏర్పాటుచేసిన డబుల్ బెడ్ రూమ్ కాలనీలో హిందువులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేటాయించిన ఇంట్లో ముస్లిం. హిందూ కుటుంబాలకు కలిపి ఒకే ఇంట్లో ఇవ్వడంతో నిత్యం మతపమైన వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్తులో మత ఘర్షణలకు దారితీయవచ్చునన్న ఆందోళన తమకు ఉందన్నారు. కాబట్టి, మతసామరస్యాన్ని కాపాడటానికి ముస్లిం. హిందూ కుటుంబాలకు వేర్వేరుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించవలసిన అవసరం ఉందన్నారు. మా వినతిని పరిగణనలోకి తీసుకొని హిందువులకి వేరుగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించవల ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాదం, బషెట్టి ప్రభాకర్, గొల్లపల్లి సత్యనారాయణ గౌడ్, గడ్డల సుగునకర్, ఎడమల వెంకట్ రెడ్డి, బండారి మల్లికార్జున్, దొనకంటీ రాజేశ్వర్ రావు, గడసు భుమన్నా, తూనికి అంజన్న, కొత్తకొండ బాలన్న తదితరులు పాల్గొన్నారు.



# రూ.100 కోట్ల క్లబ్‌లోకి 'మహావతార్ నరసింహ'

ఎలాంటి ప్రచారం లేకుండా విడుదలై సంచలనం సృష్టిస్తోంది 'మహావతార్ నరసింహ'. ఇప్పటికే పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్న ఈ సినిమా ఇప్పుడు మరో ఘనతను సాధించింది. రూ.100 కోట్ల క్లబ్‌లో స్థానం సొంతం చేసుకుంది. తాజాగా దీని వసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇండియాలో ఇప్పటివరకూ రూ.105 కోట్లు వసూలుచేసినట్లు తెలిపింది. పది రోజుల్లో ఈ ఘనత సాధించినందుకు టీమ్‌కు నెటిజన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. మొదటిరోజు రూ.1.35 కోట్లు మాత్రమే రాబట్టిన చిత్రం పదో రోజు ఏకంగా రూ.10 కోట్లకు పైగా కలెక్షన్లు సొంతం చేసుకోవడం విశేషం. ఇక ఇప్పటికే ఈ సినిమా దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ ఫిల్మ్‌గా రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. హోంబలే ఫిల్మ్స్ 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా ఏడు సినిమాలను అందించనున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న రెండో సినిమా 'మహావతార్ : పరశురామ్' దీనికంటే పవర్‌ఫుల్‌గా ఉంటుందని తాజాగా దర్శకుడు అశ్విన్‌కుమార్ తెలిపారు. 2027లో ఈ సినిమా విడుదల కానుంది. 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్'లో భాగంగా రెండేళ్లకు ఒకటి చొప్పున మొత్తం ఏడు సినిమాలు రానున్నాయి. విష్ణుమూర్తి పది అవతారాలపై ఇవి రూపొందుతున్నాయి.

### మా కోడలు.. కోచైర్‌పర్సన్ అయింది..

# చిరు స్పెషల్ పోస్ట్

తన కోడలు ఉపాసనకు అగ్ర కథానాయకుడు చిరంజీవి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్‌గా తెలంగాణ ప్రభుత్వం ఉపాసనను నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చిరంజీవి సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. ''మా కోడలు ఉపాసన ఇప్పుడు తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్. ఆమెను గౌరవప్రదమైన ఈ పదవిలో నియమించడం సంతోషంగా ఉంది. ఇది గౌరవం అనడం కన్నా కూడా బాధ్యతను మరింత పెంచిందని చెప్పాలి. డియర్ ఉపాసన.. మీకున్న నిబద్ధత, ప్యాషన్‌తో క్రీడల్లో దాగి ఉన్న అపార ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారని, ప్రతిభావంతులను అగ్ర స్థానంలో నిలబెట్టడానికి తగిన విధి విధానాలను రూపొందించడంలో నీ వంతు కృషి చేస్తావని ఆశిస్తున్నాను. సదా నీకు దేవుడు దీవెనలు తోడుగా ఉంటాయి'' అని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-ఛైర్‌పర్సన్ బాధ్యతను అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకం తనకెంతో గౌరవాన్నిచ్చిందని పేర్కొన్నారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు.





## స్పోర్ట్స్




# గిల్‌కు గావస్కర్ బహుమతి

భారత టెస్టు క్రికెట్లో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు రాబట్టిన బ్యాటర్ రికార్డును త్రుటిలో చేజార్చుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ప్రత్యేక బహుమతి అందించాడు. అండర్సన్- తెందుల్కర్ ట్రోఫీలో అయిదు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఇన్నింగ్స్‌ల్లో గిల్ 754 పరుగులు సాధించాడు. మరో 21 పరుగులు చేసుంటే గావస్కర్ (774) రికార్డును గిల్ బద్దలు కొట్టేవాడు. అయితే తన రికార్డును అందుకోనప్పటికీ గిల్‌ను ప్రశంసిస్తూ గావస్కర్ బహుమతి అందించాడు. తన సంతకంతో కూడిన టోపీ, షర్ట్‌ను అందజేశాడు. ''ఇదో చిన్న టోపీ. నా సంతకంతో చాలా తక్కువ మందికి ఇస్తా'' అని గిల్‌తో గావస్కర్ అన్నాడు.

# ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు..
# ఉత్కంఠ పోరులో భారత్‌దే విజయం




ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా సంచలన విజయం సాధించింది. హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) శతకాలు బాదడంతో ఇంగ్లాండ్ 301/3తో నిలిచింది. అయినా, భారత బౌలర్లు వెరవలేదు. ఏ మాత్రం అధైర్యపడకుండా అద్భుతంగా పోరాడారు. ఒక్కో వికెట్టూ పడగొడుతూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఆఖరి రోజూ మరింత విజృంభించి ఇంగ్లాండ్ చేతిలోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఫలితంగా ఇంగ్లాండ్ గడ్డపై భారత జట్టు మరుపురాని విజయం అందుకుని అండర్సన్-తెందూల్కర్ ట్రోఫీని 2-2తో ముగించింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ల పోరాటం టెస్టు క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది. 374 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 339/6తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా.. ఆట ప్రారంభమయ్యాక తొలి ఓవర్‌లోనే జేమీ ఒవర్టన్ (9) రెండు ఫోర్లు బాదాడు. అయితే, వరుస ఓవర్లలో జేమీ స్మిత్ (2), ఒవర్టన్‌ను పెవిలియన్‌కు పంపి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. కాసేపటికే జోష్ టంగ్ (0)ని ప్రసిద్ధ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 357/9. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన క్రిస్ వోక్స్ భుజానికి పట్టితోనే బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాడు. అయితే, వోక్స్ ఒక్క బంతిని కూడా ఎదుర్కొలేదు. సిరాజ్ బౌలింగ్‌లో అట్కిన్సన్ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. మళ్లీ బంతి అందుకున్న సిరాజ్.. అట్కినన్సన్ క్లీన్‌బౌల్డ్ చేసి ఐదు వికెట్లు పూర్తి చేసుకోవడంతోపాటు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. మహ్మద్ సిరాజ్ 5, ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224, ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 396 పరుగులు చేసింది.

- రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు.
- ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో గెలిచింది. 2004లో ఆస్ట్రేలియాపై 13 రన్స్ తేడాతో విజయం సాధించింది.

PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.

# ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వైద్య ఆరోగ్య శాఖ నజర్

**రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్**



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 4:** వివిధ ఆరోగ్య కార్యక్రమాలు వాటి అమలు తీరుతెన్నులను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ధ్యేయంగా జిల్లాల పర్యటన చేపట్టినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని సందర్శించిన ఆయనకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ప్రధాన ఆస్పత్రిలో వసతులు, మందుల లభ్యత, రోగులు పొందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్ విభాగాన్ని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు పట్ల సంసిద్ధత, ఆసుపత్రిలో ల్యాబ్ సేవలను ఆరా తీశారు. ఆసుపత్రిలో సిజేరియన్ ప్రసవాలు తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు. అందుకు గర్భవతులకు వారి కుటుంబ సభ్యులకు సాధారణ ప్రసవాల వల్లే కలిగే లాభాలపై అవగాహన కలిగించాలన్నారు. స్త్రీల వార్డు మరియు పురుషుల వార్డులను పరిశీలించి అక్కడ పేషంట్లతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేషెంట్లకు అందుతున్న ఉచిత పోషకాహారం పరిశీలించి సమీక్షించారు. నర్సింగ్ సిబ్బంది సంఖ్య ఆసుపత్రి సేవలకు అనుగుణంగా ఉన్నదా, లేదా అనే విషయాన్ని సమీక్షించారు. ఆస్పత్రిని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి వస్తున్న రిఫరల్ కేసులకి ప్రాముఖ్యత ఇస్తూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం కలిగి ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను ప్రాముఖ్యత ఆధారంగా పరిష్కరించుకోవాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా అవసరాలకు తగిన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

**మానకొండూర్ పీహెచ్‌సీ తనిఖీ..**

మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణతో కలసి తనిఖీ చేశారు. హాజరు పట్టికను, అవుట్ పేషెంట్ రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. ఎన్‌సిడి క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రికార్డులను పరిశీలించి అందులో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి సంబంధిత వ్యాధిగ్రస్తులకు మందులు ఇస్తున్న తీరును గమనించారు. ఫార్మసీ స్టోర్స్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ జరిగిన మహిళలను రీస్క్రీనింగ్ చేయాలన్నారు. ఆపరేషన్ థియేటర్‌ను, ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందుల పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగే విధంగా గర్భవతులను, వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలను తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధ, డిటిసిఒ డాక్టర్ రవీందర్ రెడ్డి, డిఐఓ డాక్టర్ సాజిద, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు, పీఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనజ వేరియా, డెమో రాజగోపాల్, డిపి స్వామి, మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సల్మాన్, డాక్టర్ నిక్కత్, డిపిఓ ఎన్ హెచ్ ఎం స్వామి, సిహెచ్ఓ రాజు నాయక్, రామనాథం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించండి

**ప్రజావాణిలో వినతి పత్రం అందజేసిన విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్**



**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 4:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అందుబాటులోకి తెచ్చి, మండలంలోని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థి జన సమితి అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ వసతి గృహం ఉన్నప్పటికీ రెగ్యులర్ వార్డెన్, సిబ్బంది కొరతతో ప్రారంభించక పోవడంతో పొన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన వసతి గృహాన్ని అందుబాటులోకి తేవాలని జిల్లా విద్యార్థి జన సమితి అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ వినతిపత్రం అందజేశారు.

## భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయండి

**జనం పవర్, జిన్నారం, ఆగస్టు 4:** జిన్నారం మండల గ్రామానికి చెందిన రైతులు తమ భూముల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ రైతులు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. సర్వే నంబర్లు 1, 376ల పరిధిలోని 180 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్క్ పేరిట తీసుకొని పరిశ్రమలకు కేటాయించింది. భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 60 గజాల చొప్పున హెచ్ఎండిఏ స్థలాన్ని కేటాయిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులందరికీ స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సర్టిఫికెట్లు కూడా జారీ చేశారు. ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదని భూములు కోల్పోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్డిఓ హెచ్ఎండిఏ అధికారులకు కూడా భూములు కోల్పోయిన రైతులు విన్నవించుకున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన ల దని విమర్శించారు. దీనితో సమస్యను వివేచనాత్మకంగా పరిశీలించాలని, తక్షణమే స్థల సరిహద్దులు పరిశీలించి స్థలం కేటాయించాలని జిన్నారం తాసిల్దార్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు రైతులకు మద్దతుగా నిలుస్తుండటంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సింగరేణిలో కారుణ్య నియామకాలు అటకెక్కనున్నాయా..?

**నూతన గనులు ప్రారంభం కలేనా..?**

(జనం పవర్, కోల్ బెల్ట్)

గత ఎంతో చరిత్ర కలిగి తెలంగాణ రాష్ట్రానికి లక్షలాది మందికి ప్రత్యక్షంగా కోట్లాది జనాలకు బతుకుదెరువునిచ్చిన సింగరేణి సంస్థ గత పది సంవత్సరాల నుండి ఒక్క నూతన గనిని కూడా ప్రారంభించకుండా ఉన్న భూగర్భ గనులను మూసేస్తూ ఓపెన్ కాస్టులు పెంచేస్తుంది. ఉపాధి కల్పన కోసం ఈ ప్రాంత యువతకు భరోసా కల్పించిన పాపాన పోలేదు. దేశంలో ఆర్థిక సరళీకరణ లాంటి సంస్కరణలు బీజేపీ ప్రభుత్వ హయాంలో వేగమతమై కేవలం గుజరాతి పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా నరేంద్ర మోడీ అమిత్ షాలు తమ పన్నాగాలను అమలు చేస్తున్నారు. తద్వారా తెలంగాణ రాష్ట్రం బొగ్గు గనులు పొందకుండా చాప కింద నీరుల కుట్రలకు తెరలేపింది. ఈ విషయాన్ని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. గత పది సంవత్సరాల టీఆర్ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయమై ప్రతి దాంట్లో పైరవీలను ప్రోత్సహించి ఉద్యోగాల కల్పనలో పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి నూతన రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 62 వేలుగా ఉన్న కార్మికుల సంఖ్యను 40 వేలకు కుదించిన చరిత్ర కూడా ఆ ప్రభుత్వానికే దక్కుతుంది. ఏ ప్రమోషన్ కావాలన్నా అవినీతి రాజ్యమేలింది. కాస్తో కూస్తో కొనసాగుతున్న మెడికల్ ఇన్వాల్యుడేషన్ పూర్తిగా లంచాలమయమైంది. అయినా కార్మికులకు కొంత భరోసాగా ఉందని అన్నిటికీ భరించిన కార్మిక కుటుంబాలకు నేడు గత కొన్నేళ్ల నుండి ఇన్వాల్యుడేషన్లు నిలిపేసి అనారోగ్యం బారినబడిన కార్మికులను కార్పోరేట్ ఆసుపత్రు లకు రిఫర్ చేసి 9 నెలలకు పైగా వారిని ఆర్థిక నష్టానికి గురిచేసి చావు కబురు చల్లగా చెప్పినట్లు ఈమధ్య ఆ కార్మికులను బోర్డుకు పిలిచి కేవలం ఐదుగురిని మాత్రమే ప్రకటించింది. మిగతా వారిని కొందరికి సూపర్వైజర్ క్యాటగిరి కార్మికులకు సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా మార్చి మానసిక వేదనను కలిగించారు. ఈ విషయాన్ని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ప్రతిపక్ష సంఘాల వలెనే ప్రకటనలకు పరిమితమయ్యారు తప్ప యాజమాన్యంపై ఎలాంటి ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయలేదు. ఈ విషయాన్ని కార్మికులు తప్పు పడుతున్నారు. ఉద్యోగాల కల్పన కోసం ఉన్న ఏకైక అవకాశాన్ని లేకుండా చేసే యాజమాన్య పన్నాగాలకు ఈ సంఘాలు కూడా వంత పాడుతున్నాయనేది కార్మిక కుటుంబాల ఆవేదన.

మాది గొప్ప పోరాటాల చరిత్ర అంటే మాదే గొప్ప చరిత్ర అంటూ వేదికల మీద చనిపోయిన వాళ్ళ పేర్లను వల్లించడం ఈ సంఘాలకే చెల్లింది. నిజంగా అదే స్ఫూర్తిని మీరు కొనసాగించి ఉంటే ఈరోజు సింగరేణికి నూతన గనులు ఎందుకు రావడం లేదు. ఉద్యోగాల సంఖ్య కుదించబడడానికి కారకులెవరు..? సంస్కరణల పేరుతో ఇన్ని పరిణామాలు జరుగుతున్నప్పటికీ అడ్డుకోవడంలో నాయకులు ఎందుకు పట్టించుకోవడం లేదు.. అనే ప్రశ్నలు సర్వత్ర వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం సింగరేణిలో 39 వేల కార్మికులు మాత్రమే కొనసాగుతున్నారు. ఈ సంఖ్య రాను రాను మరింత తగ్గిపోయే పరిణామాలే ఉన్నాయి తప్ప ఎక్కడ కూడా ఉద్యోగ అవకాశాలు ఉంటాయో లేదో అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయగలిగిన గొప్ప మంచి పని ఏదైనా ఉందా అంటే రాష్ట్రానికి గుండెకాయగా చెప్పబడుతున్న సింగరేణి సంస్థను కాపాడడం ఒక్కటే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. ఈ ప్రాంత యువత ఇక్కడ ఉద్యోగాలు లేక దేశ విదేశాలలో ఉద్యోగాల వేట కోసం బయలుదేరి ఎన్నో రకాల ఇబ్బందుల్ని నిత్యం ఎదుర్కొనే పరిస్థితులు దాపరించాయి. మా నాన్న దిగిపోతే నాకు కొలువస్తుంది.. నా కుటుంబం జీవిస్తుంది.. అనే ఆశలు అడియాశలై ఇక్కడి కుటుంబాలన్నీ ఆగమైపోతున్నాయి. కేవలం ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈ ప్రాంతానికి వచ్చే పెద్ద పెద్ద నాయకులు అరచేతిలో వైకుంఠం చూపి, ఎన్నికలు అయిపోగానే సింగరేణి ప్రాంతాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతామని, నూతన గనులు ప్రారంభిస్తామని వేదికల మీద గప్పాలు కొట్టడం.. ఎన్నికల అనంతరం ముఖాలు చాటేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గతంలో సింగరేణి సంస్థ అన్వేషించిన గనులను ప్రారంభించి ఇక్కడి కార్మిక కుటుంబాలకు బాసటగా నిలవాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఈ ప్రాంతం నుండి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు చొరవచూపి సింగరేణి ఏరియాలలో పూర్వ వైభవం కోసం కృషి చేయాల్సిందిగా కార్మిక కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయి. మరి పాలకుల స్పందన ఏ విధంగా ఉండనుందో..?

## సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 4:** మంచిర్యాల జిల్లా మందమర్రి బొగ్గు గని ఏరియాలో నిర్వహిస్తున్న సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్, సిసిసి నస్పూర్ నందు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి సింగరేణి కోటాలో మిగిలి ఉన్న 66 సీట్లు (సివిల్ -27, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ -06, మెకానికల్-23, మైనింగ్-10)కు తక్షణం భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్లు 7.8.2025 కౌన్సెలింగ్ రోజున తెలుపుతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇతర కాలేజీలలో సీటు పొందిన విద్యార్థులు సీటు రద్దు చేసుకొని రావలెనని, లేని పక్షంలో సీటు కేటాయించబడదని తెలిపారు. రిజిస్ట్రేషన్ వివరాల కోసం డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. (ఎస్‌సిపి) ఎస్‌సి పిఓఎల్వై టెక్నిక్.కం సందర్శించాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్స్‌కు పాలిసెట్ 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో సీట్లను భర్తీ చేయబడునని ఆ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సా. 5 గంటల వరకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కాలేజీ సెల్: 9010222161, 8332974597, 879011 2515 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## నిర్మల్ రూరల్ ఐకేపీ ఏపీఎంగా అరుణ



**జనం పవర్, బైంసా, ఆగస్టు 4:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో నిర్మల్ రూరల్ మండల ఏపీఎంగా అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అరుణ ఇంతకుముందు మామడ మండలంలో ఏపీఎంగా పనిచేసి బదిలీపై నిర్మల్ రూరల్ మండలం వచ్చారు. నిర్మల్ మండల రూరల్ ఏపీఎంగా పనిచేసిన బోసు దిలావర్పూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి ఐకేపీ సిబ్బంది అరుణకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు నరసయ్య, జ్యోతిర్మయి, రేఖ, భోజన్న, అకౌంటెంట్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నా భర్తను స్వదేశానికి రప్పించండి..



**జనం పవర్, బైంసా, ఆగస్టు 4:** నిర్మల్ జిల్లాలో ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన రేకల రాజేందర్ బతుకు దెరువుకోసం దుబాయ్‌కు వెళ్ళగా అక్కడ జరిగిన ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో బాధితుడి భార్య మల్లేశ్వరి, అత్త పెద్దక్క సోమవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాన్సన్ నాయక్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. రాజేందర్ స్వదేశానికి వచ్చేలా చూడాలని కోరారు. నాయక్ స్పందించి దుబాయ్‌లోని ఎంబసీ అధి కారులతో మాట్లాడారు. రాజేందర్‌ను స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని జాన్సన్ నాయక్ హామీ ఇచ్చారు.

**జనహిత యాత్రలో ఒరిగిందేమీ లేదు..**

ఖానాపూర్ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్వహించిన జనహిత పాదయాత్రతో ఉమ్మడి ఆదిలాబాదుకు ఒరిగిందేమి లేదనీ బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జి జాన్సన్ నాయక్ అన్నారు. కనీసం ఈ ప్రాంత సమస్యలను ప్రస్తావించకుండా కేవలం ఎన్నికల ప్రచార సభలుగా మాత్రమే కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించారని మండిపడ్డారు.

## నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 4:** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా వైద్యాధికారి, ఇంటర్మీడియట్ అధికారి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

**ప్రజావాణికి 290 దరఖాస్తులు**

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి 290 దరఖాస్తులు వచ్చాయి. అర్జీదారుల నుండి దరఖాస్తుల స్వీకరించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వాటి పరిష్కారం కోసం జిల్లా అధికారులకు బదిలీ చేశారు.

జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళాను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రాఖీలను కలెక్టర్‌కు కట్టారు.

# అంతర్ జిల్లా దొంగ అరెస్ట్.. దొంగిలించిన సొత్తు స్వాధీనం

**18 తులాల బంగారం, 164 తులాల వెండి, లక్ష నగదు స్వాధీనం: పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 4:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. పెద్ద మొత్తంలో నగదు, వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుండి 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ. లక్ష నగదు, ఒక మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయో గించిన మారుతి ఫ్రాంక్స్ కారు, ఇనుప రాడ్లు, గ్లౌజులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.

ఆయన తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన టేకు చిరంజీవి (22) హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పగలంతా తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీలకు పాల్పడుతున్నాడు. మే 7న నిజామాబాద్ జిల్లా, వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడ్కుడ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చిరంజీవి సుమారు 66 గ్రాముల బంగారం దొంగిలించాడు. ఆ బంగారాన్ని తన తండ్రి గంగసాయిలు సహాయంతో నందిపేటలోని బంగారు నరసయ్య అనే వ్యక్తికి విక్రయించాడు. జూన్ 10న కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో ఒక ఇంట్లో పావు తులం బంగారు గొలుసు, 4 తులాల వెండి గొలుసులు, రూ. 5,000 చోరీ చేశాడు. అదే నెల 30న రామడుగు మండలం శానగర్‌లో 5 తులాల బంగారు హారం దొంగిలించాడు. జూలై 16న మానకొండూరు మండలం, గంగిపల్లిలో ఒక తులం బంగారు చైన్, 6 తులాల వెండి, రూ.30,000లు, 22 తేదీన తిమ్మాపూర్ మండలం, పోరండ్లలో ఏకంగా మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడి సుమారు 2.75 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 1,65,000 నగదు దొంగిలించాడు. గత నెల 23న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో బంగారు షాపుతో సహా మూడు చోట్ల దొంగతనం చేసి సుమారు 5.5 తులాల బంగారం, 90 తులాల వెండి చోరీ చేశాడు. 24న గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామంలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి చోరీ చేశాడు.

**దొంగిలించిన సొత్తు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్..**

దొంగతనాలకు పాల్పడిన చిరంజీవి ఆ సొత్తును అమ్మిన నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలో బంగారు షాపు నడుపుకుంటున్న కొండూరు గ్రామానికి చెందిన బంగారు నరసయ్య (44)ను కూడా అరెస్ట్ చేశారు. నరసయ్య నందిపేటలో బంగారు షాపు నడుపుతూ, తక్కువ ధరకు దొంగిలించిన ఆభరణాలను కొనుగోలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలిందని, చిరంజీవి, అతని తండ్రి గంగ సాయిలు నరసయ్యకు గత మే 10న సుమారు 66 గ్రాముల బంగారం విక్రయించగా, నరసయ్య వారికి రూ. 1,14,000 చెల్లించినట్లు అంగీకరించాడని సీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఏసీపీ వెంకటస్వామి, సీసీఎస్ ఏసీపీ జాన్ నర్సింహులు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ప్రకాష్, ఎల్ఎండి ఎస్సై శ్రీకాంత్, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్ నరేష్, జైపాల్ , సీసీఎస్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌లను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రైతాంగ సాధికారతతోనే జాతీయ సమైక్యత బలోపేతం

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**జనం పవర్, పటాన్‌చెరు, ఆగస్టు 4:** గ్రామీణ ప్రజలు, రైతాంగ సాధికారతే జాతీయ సమైక్యత బలోపేతానికి బలమైన ఆధారమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ పరిధిలోని రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ చర్చాగోష్ఠి సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు ప్రారంభోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ సెమినార్‌లో గవర్నర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ అద్భుతమైన నాయకత్వాన్ని ప్రస్తావించారు. రైతు ఉద్యమాల పట్ల పటేల్ చూపిన దార్శనికత చాలా పెద్ద ఆస్తి అని, ఆయన సేవలు ఇప్పటికీ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. బార్డోలి సత్యాగ్రహం (1928)లో పటేల్ నాయకత్వం, రైతులు, భూమిలేని కార్మికుల సాధికారత కోసం ఆయన పోరాటాన్ని ప్రత్యేకంగా గుర్తు చేశారు. గామీణ భారత్ దేశ ఆత్మగా నిలుస్తుందని చెబుతూనే, పటేల్ కోణం, రైతాంగ శక్తివంతీకరణపై చర్చించటం చాలా అవసరమన్నారు. మన జీవితాలను పేదలు, అణ గారిన వర్గాలతో పంచుకోవడంలో అసలైన ఆనందం ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి హాజరైన గుజరాత్ ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ జోషి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విశిష్టతను వివరించారు. సామాజిక సమరస్థ మంచ్ జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ నాయకత్వం కేవలం రాజకీయం మాత్రమే కాదు, రైతాంగ సామర్థ్యాన్ని పెంపొందించడానికేనని స్పష్టం చేశారు. వేదికపై వివిధ ప్రముఖులకు రాజ్ మోహన్ గాంధీ రచించిన పటేల్ పైని పుస్తకాలను అందించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు స్వాగతోపన్యాసంతో సభను ప్రారంభించారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ గుబ్బం అశోక్ వందన సమర్పణ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పండితులు, ఆలోచనాపరులు చర్చాగోష్ఠిలో పాల్గొంటున్నారు. గుజరాత్ సర్దార్ పటేల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, ఏపీ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ షీలా రెడ్డి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.నాగరాజు, ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సెమినార్, సర్దార్ పటేల్ రైతుల పట్ల చూపిన దార్శ నికతను, భారత గ్రామీణ వ్యవసాయ రంగం పరివర్తనలో ఆయన అవకాశాన్ని, జాతీయ ఐక్యతపై చేశారు. ప్రభావాన్ని సమగ్రంగా చర్చించేందుకు ముఖ్య వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# నిమ్న వర్గాలపై వివక్ష కొనసాగడం బాధాకరం

## అంబేద్కర్ సంఘం నాయకులు చెప్పాల ప్రకాష్, వెలమకంటి దయాకర్




**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 4:** ఇప్పటికీ నిమ్న వర్గాల జాతులపై వివక్ష కొనసాగడం బాధాకరమని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పాల ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలమకంటి దయాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తరతరాలుగా ఈ దేశంలో అణగారిన వర్గాలను ఆధిపత్య పెత్తందారి వ్యవస్థ వెనుకకు నెట్టి వేయబడిన రోజుల నుంచి, అంటరానితనాన్ని స్వయంగా అనుభవించి, దాని నిర్మూలణకు పోరాటం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు, ప్రపంచ చరిత్రలోనే భారతదేశ రాజ్యాంగం గొప్ప రాజ్యాంగంగా అభివర్ణించారు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెల 18 రోజులు శ్రమించి భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. నాటి నుంచి నేటి వరకు కూడా భారత రాజ్యాంగంలో పొందు పరిచిన అన్ని విధాలైనటువంటి చట్టాలు ఉన్నప్పటికీ కూడా ఇంకా నిమ్న వర్గాల జాతులపై వివక్ష ఉందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలను అనుభవించి ఉన్నతమైన స్థాయిలో ఉన్నవారు, అంబేద్కర్ సిద్ధాంతాన్ని మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఉన్నత స్థానాలు అధిరోహించిన వారు కూడా అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు రాలేకపోతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అంబేద్కర్ వాదులకు, గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల చేరాలు, రాష్ట్ర కార్యదర్శులు తొందర ఎల్లన్న బోజన్ కండె సుధాకర్, ఎల్కతుర్తి మాజీ ఎంపీపీ మేకల స్వప్న, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి మాట్ల వెంకటస్వామి, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్రె మహేందర్,రాష్ట్ర అధికార ప్రతినిధి తుమ్మల సదానందం, జిల్లా కోకన్వీనర్ సాతూరి రాజమౌళి, జిల్లా మాజీ అధ్యక్షులు సాతూరు చంద్రమౌళి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మేక రమేష్, బీసీ ఉద్యమ నాయకులు వేముల జగదీష్, కార్యక్రమ సభాధ్యక్షులు గుర్రపు శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు ఎర్ర కార్తీక్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కడారి జయపాల్, కాతూరి ప్రసాద్, సాతూరి వెంకన్న సీనియర్ దళిత సంఘాల నాయకులు, స్థానిక సర్పంచ్ రవీందర్ రెడ్డి, తంగళ్లపల్లి రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు, విగ్ర ఆవిష్కరణ కమిటీ, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కబ్జా పట్టా యత్నాలు అడ్డుకోండి

## తహసీల్దార్‌కు దళితుల వినతి



**జనం పవర్, వేలేరు, ఆగస్టు 4:** వంద సంవత్సరాల పైబడి తాము సాగు చేసుకుంటున్న భూమిని గతంలో రిదొర్లిన తప్పును అడ్డుపెట్టుకుని కబ్జా చేసి వేరేవారికి అమ్మి రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కన్నారం అనుబంధ గ్రామమైన ఇచ్చులపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు సోమవారం వేలేరు తహసీల్దార్ కోమిని కలిసి వినతి పత్రం సమర్పించారు. దళితులైన బాధితుల కథనం మేరకు.. తమ కుటుంబాలకు చెందిన సర్వే నంబర్ 533 సిలో ఎకరం 19 గుంటల భూమిని తమ కుటుంబాలు వంద సంవత్సరాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నాయని తెలిపారు. ఆ భూమిలోనే తమ తాతల తండ్రుల సమాధులు కూడా ఉన్నాయని చెప్పారు. అయితే గతంలో భూములను రికార్డుల్లో నమోదు చేసే సమయంలో పొరపాటున కన్నారం గ్రామానికి చెందిన రాగుల కనకయ్య అనే వ్యక్తి పేరిట నమోదు అయిందని తెలిపారు. ఇటీవల ఈ పొరపాటును గుర్తించిన తమ గ్రామానికి చెందిన మిడిదొడ్డి కొమురయ్య అనే వ్యక్తి తమ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తన పలుకుబడి వాడుకుని ఆ భూమిని కబ్జా చేసి ఇతరులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. ఇందులో భాగంగా రాగుల కనకయ్య భార్య లచ్చవ్వతో చేతులు కలిపి పొరపాటున నమోదు అయిన రికార్డులు చూపిస్తూ ఆ భూమిని తమదేనని బెదిరిస్తూ తమకు అన్యాయం చేయాలని చూస్తున్నాడని వారు పేర్కొన్నారు. అంతే కాకుండా సదరు భూమిని సాగు చేసుకుంటున్న తమకు తెలియకుండా కొలు గూరి రాజు అనే వ్యక్తికి అమ్మ జూపుతూ మోసరితంగా రిజిస్ట్రేషన్ చేసే నిమిత్తం ఆన్‌లైన్ లో స్లాట్ కూడా బుక్ చేసుకున్నాడని వివరించారు. ఈ విషయం తెలిసిన తాము సర్వే నెంబర్ 53 సిలో ఎకరం 19 గుంటల భూమిని వేరే వారి పేరు మీదికి మార్చ రాదని, అలాగే రిజిస్ట్రేషన్ కూడా చేయరాదని తహసీల్దార్ కోమికి వినతిపత్రం అందించారు. అలాగే అక్రమ రిజిస్ట్రేషన్ ప్రయత్నాలు ఆపాలన్నారు.

తమకు అన్యాయం జరిగితే తమ కుటుంబాలు అన్నీ కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందే సామూహికంగా ఆత్మహత్యలు చేసుకుంటామని ఇచ్చుల పల్లి దళితులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ కార్యక్రమంలో మిడిదొడ్డి పోషయ్య, మిడి దొడ్డి రవి, పుష్పలత, సురేష్, వెంకటాద్రి, షాంసన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలం ఆక్రమణపై గ్రామస్తుల రాస్తారోకో



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 4:** ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించడాన్ని నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గాండ్లవారి కుంట వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ కుంట స్థలాన్ని చదును చేస్తూ కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి ఇరిగేషన్ అధికారులు ఆందోళనకారులతో మాట్లాడారు. తమ విచారణలో కుంటకట్ట కొంత ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ప్రజావాణికి 181 అర్జీలు



**జనం పవర్, హనుమకొండ, ఆగస్టు 4:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 181అర్జీలను అందజేశారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందజేసిన అర్జీలపై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అప్పటికప్పుడే జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, హనుమకొండ పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

## - వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్




**జనం పవర్, వరంగల్, ఆగస్టు 4:** ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్‌లో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ శాఖలలో గెస్ట్ ఫ్యాకల్టీ (అతిథి అధ్యాపకులు) ఖాళీలను తాత్కాలికంగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ పోస్టులకు ఎంపికయ్యే అభ్యర్థులకు నెలకు రూ.28,000/- పారితోషికం అందించబడుతుందన్నారు. దరఖాస్తులకు ఈ నెల 5 వరకు అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ప్రభుత్వ పాలి టెక్నిక్, వరంగల్ ప్రిన్సిపాల్‌ను ప్రత్యక్షంగా సంప్రదించవచ్చున్నారు. ఇతర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా ఇలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, మెకానికల్, సివిల్, , గణితం, రసాయన శాస్త్రం, ఆంగ్ల భాష తదితర విభాగాల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత విభాగాల్లో అర్హత కలిగిన అభ్యర్థులు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలలో దరఖాస్తు చేయవచ్చని సూచించారు.

# ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



**జనం పవర్, పటాన్‌చెరు, ఆగస్టు 4:** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కుమ్మరి బస్వరాజు అనారోగ్యంతో తరచుగా చికిత్స పొందుతూ ఉన్నారు. మెరుగైన వైద్యసదుపాయాల కోసం ప్రభుత్వంచే మంజూరైన రూ.2,50,000 విలువైన ఎల్‌ఓసిని సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా బస్వరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ఆర్థికంగా బలహీనులైన వారు కూడా కార్పొరేట్ హాస్పిటళ్లలో వైద్యం పొందేందుకు సీఎం సహాయనిధి ద్వారా విస్తృతంగా సహాయం అందిస్తున్నారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు



**జనం పవర్, వరంగల్, ఆగస్టు 4:** వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లుల మంజూరులో అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దేశాయిపేట గ్రామ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన యొక్క పేర్లు అనర్హుల జాబితాలో ఉన్నాయని, కొంతమంది ఇందిరమ్మ కమిటీ మెంబర్లు వారికి నచ్చిన వారి పేర్లు మంజూరు చేసి అర్హులైన వారికి నష్టం చేకూర్చారని విన్నవించారు. ఈ విషయంపై 12, 13 డివిజన్లకు సంబంధించిన అర్హులైన సుమారు 20 మంది కలిసి కలెక్టర్‌కు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఈ విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని చెప్పారు. మీకు ఇల్లు రాలేదని బాధపడోద్దని, అర్హులైన వారికి కచ్చితంగా మంత్రితో మాట్లాడి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎవరు బాధపడోద్దని, అండగా ఉంటానన్నారు. ప్రభుత్వ అధికారుల నిబంధనల మేరకు నిర్మాణం చేసినట్లయితే ఇందిరమ్మ ఇండ్లకు కావలసిన ఇసుక ఇటుకలు, కాంక్రీట్, రాడ్ బెండింగ్, మేస్త్రీలను మ కూడా తక్కువ ధరకు ఇప్పిస్తామని చెప్పారు. అధిక ధరలకు ఎవరు పనులు చేయించుకోకూడదని జాగ్రత్తలు తెలిపారు.

ఆర్థిక స్తోమత లేని వారికి బ్యాంకు నుంచి రుణం, ఇప్పిస్తామని భరోసా (హామీ) ఇచ్చారు. ఈ విషయం విన్న ఇంది రమ్మ ఇళ్ల అర్హులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో జాతీ య అంబెద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జన్ను అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు జన్ను నూతన్ బాబు, జన్ను రాజు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, దేశాయిపేట గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.



# జీవ వైవిధ్యంతోనే మనుగడ సాధ్యం

సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు,ఏదీ తక్కువ కాదు.అన్ని సమానమే, ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధారపడతాడు.ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవవైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకునే వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు.భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటాం. నేడు మన భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవవైవిధ్యం సుమారు 3.5 బిలియన్‌సంవత్సరాల పరిణామం. మన జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో మనదేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు మనదేశంలో ఉన్నాయి. కానీ ఇదంతా గతం. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికిపైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు లుప్తమైపోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను మన జీవనశైలితో రూపుమాపేశాము. సముద్రతీరాలను అతలాకుతలం చేసేశాము. ఇవన్నీ చాలవన్నట్టు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు అంతమొందిస్తున్నారు. జీవో వైవిధ్యానికి ప్రత్యేకంగా తెలంగాణ నిలుస్తున్నది. అరుదైన పక్షి జాతులు, విభిన్నమైన చేపల రకాలు, సీతాకోకచిలుకల,ఇతర జంతు జాతులు.. ఇలా అనేక ప్రత్యేకతలను రాష్ట్రం సొంతం చేసుకుంది. రాష్ట్రంలోని పోచారం, మంజీరా,అనంతగిరి, జన్నారం, ఏటిఆర్, వరంగల్ పాకాల తదితర ప్రాంతాల్లో అద్భుతమైన జీవవైవిధ్యం అలరారుతోంది. అడవులు,జల వనరులు,ప్రకృతి సిద్ధం మధ్య ఒక సమన్వయ బంధం ఏర్పడితే అన్ని జీవరాసులు సుహృద్భావ వాతావరణంలో పెరుగుతాయని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు. తెలంగాణకే ప్రత్యేకమైన కొన్ని చేపలు,గుడ్లగూబలు పావురాలు, 400 వరకు రకరకాల పక్షులు ఉన్నాయి. జీవవైవిధ్యం పెంపుదలకు పులులు,చిరుతపులులు కీలకమైనవే అయినా అవే సర్వస్వం కాదని మొక్కలు, పక్షులు,జంతువుల మనుగడ, పురోభివృద్ధి కూడా ముఖ్యమేనని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రాష్ట్రంలో 500 నుండి 600 రకాల ఔషధ మొక్కలు కీలక భూమిక పోషిస్తున్నాయి. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాదు మనదేశంలో అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోయాం. అంతేకాదు అపార జీవజాతులు అంతరించిపోయాయి. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవసంపదను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాదు, అత్యధిక కీటక నాశనులను ఉత్పత్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లుతోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్టపోయాం. అంతేకాదు అపార జీవజాతులు అంతరించిపోయాయి. మన దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువమందే ఆదివాసులు నివసిస్తున్నారంట. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లో 80 శాతానికంటే ఎక్కువమంది గిరిజనులు ఉన్నారు. అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యుమార్పిడివల్ల వచ్చే ప్రభావాలు స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్య యనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశ పెట్టకూడదు. తొందరపడితే ప్రస్తుతం మనుగడలోని జీవజాతికే ప్రమాదం వాటిల్లు తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. సుందర్‌లాల్ బహుగుణ నిర్వహించిన చిప్కో ఉద్యమం, పర్యావరణ పరిరక్షణకు సాగిన ఉద్యమాలన్నింటికీ తలమానికమైనది. స్వీడన్ బాలిక గ్రేటా తంబెర్గ్ 'వాయిస్ ఫర్ ది ప్లానెట్ అండ్ ది స్ట్రైక్ ఫర్ క్లైమెట్' నినాదంతో నిర్వహించిన జీవ వైవిధ్య రక్షణ ఉద్యమం ఆ దేశంలో పర్యావరణ అనుకూల విధానాలు అమలయ్యేలా చేసింది. గ్రెటా తంబెర్గ్, వందనా శివ, మేథాపాట్కర్, వనజీవి రామయ్య దారిలో పౌర సమాజం జీవ వైవిధ్య రక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉన్నది. ప్రపంచమంతటా ఏటా 10 వేల జాతులు లేదా రోజుకు 27 జాతులు అంతరించిపోతున్నాయనేది యదార్థం. ఐక్యరాజ్యసమితి ఏటా మే 22 న నిర్వహిస్తున్న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం లో ఒక కొత్త థీమ్ తో కార్యక్రమాలకు పిలుపునిస్తోంది. ఆ కోవలోనే 2024 లో ప్రణాళికలో భాగమవ్వండి అనే నినాదం జీవ వైవిధ్యాన్ని సంరక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి సమిష్టి ప్రయత్నాలలో చురుకుగా పాల్గొనడానికి వ్యక్తులు, సంఘాలు మరియు దేశాలను కోరుతున్నది. ప్లాస్టిక్‌ను దూరం పెట్టి, మన ఆరోగ్యంతో పాటు పుడమి తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కృషిచేయాలి.2030 నాటికి కనీసం 30 శాతం భూమి ఉపరితలాన్ని రక్షించాలని పథకాలు రూపొందిస్తున్నారు. భూమి ఉపరితలం రక్షించబడితే దీని మీద ఆధారపడిన వృక్ష, జంతుజాతులు కూడా రక్షించబడతాయి.ఇందులో భాగంగానే అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణ కోసం సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. వాటి సంతతిని వృద్ధిచేసి జీవ వైవిధ్యానికి పాటుపడుతున్నారు. మన జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి.జంతువుల్ని, మొక్కల్ని పరిరక్షించుకోవాలి. చాలా మంది జంతువుల చర్మాలతో చేసే వస్తువుల్ని వాడుతుంటారు.దీన్ని మానుకోవాలి. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిదిగా భావించాలి.

